

Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

Longest Living Newspaper in Telugu Journalism

జమీందారు

సంపుటి: 82 • సంచిక: 23 • 10-6-2011 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-




పిసిసి పెద్దగా సత్తిబాబు సరైన వ్యక్తే!

● రాష్ట్ర కాంగ్రెస్‌లో కాయ కల్ప చికిత్స మొదలెట్టిన అధిష్టానం.



ఎట్టకేలకు, చిట్ట చివరకు రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ఎంతో కొంత జీవము, జవము కల్గించే ప్రయత్నం ప్రారంభించింది అధిష్టానం. వైఎస్ మరణం నాటి నుంచి ఏ విషయంలోనూ నిర్ణయం తీసుకోకుండా, ఏ వివాదాన్నీ పరిష్కరించకుండా, ఏ పదవినీ పూరించకుండా నెలల కాలం గడిపిన ఢిల్లీ పెద్దలలో ఇన్నాళ్లకు కదలిక వచ్చింది. స్పీకర్, డిప్యూటీ స్పీకర్, శాసన మండలి ఛైర్మన్, డిప్యూటీ ఛైర్మన్ పదవులను ఒక్కసారిగా భర్తీ చేశారు. పిసిసి కొత్త అధ్యక్షుడిగా రవాణా మంత్రి బొత్సా సత్తి బాబును నియమించారు. డిప్యూటీ ముఖ్యమంత్రి, కార్పొరేషన్ ఛైర్మన్ వంటి పదవులనూ త్వరలో భర్తీ చేయనున్నారు.

కార్టూన్ స్కేప్



'బోడి' ఎద్దుల్లా కాకుండా
'జోడి' ఎద్దుల్లా పేరు తెచ్చుకోమంటూ
గ్రీటింగ్స్ వచ్చాయి సార్!

వీటన్నింటిలోకి కీలకమైనది పిసిసి అధ్యక్షత. రెండేళ్ల క్రితం ఎన్నికలు జరిగిన నాటి నుంచి డి.శ్రీనివాస్ ఆ పదవిలో ఆపద్ధర్మంగా కొనసాగుతున్నాడు. తాను ఉండబోయే పదవి కాకపోవడం, ఒకటికి రెండు పర్యాయాలు శాసన సభ్యుడిగా ఓటమి చవి చూడడంతో ఆయనలో ఆత్మస్థైర్యం లోపించింది. అలంకారప్రాయంగా గాంధీభవన్‌కు వచ్చి పోవడం తప్ప ఏ విషయంలోనూ చొరవ, ఆసక్తి చూపలేదు. దాంతో రాష్ట్రం మొత్తం మీద పార్టీ నిర్వీర్యమై పోయింది. కార్యకర్తలలో ఉత్సాహం లోపించింది. అటు రోశయ్య, ఇటు కిరణ్‌కుమార్‌రెడ్డి ఇద్దరూ రాజకీయ సమర్థతలేని వారు కావడం; వైఎస్ జగన్ ఒక వ్యూహం ప్రకారం కాంగ్రెస్‌ను సమాధి చేయడానికి కంకణం కట్టుకొని పనిచేస్తుండడంతో దిగువస్థాయి నుంచి మంత్రుల వరకు కాంగ్రెస్ భవిష్యత్తు మీద ఆశలు అడుగంటాయి. ప్రభుత్వం వుంటుందా, ఊడుతుందా అన్న అనుమానం ప్రజలను వేధిస్తున్నది. ప్రభుత్వం నిలిచినా రేపటి ఎన్నికలలో కాంగ్రెస్‌కు పుట్టగతులు వుండవన్న నిశ్చితాభిప్రాయం అందరిలోనూ గూడుకట్టుకొని వుంది. ఈ నిరామయ, నిరాశాపూరిత వాతావరణంలో సత్తిబాబుకు పిసిసి అధ్యక్షత కట్టబెట్టడం చీకటిలో చిరుదివ్వెతో సమానంగా కన్పిస్తున్నది కాంగ్రెస్ వాదులకు.

సత్తిబాబు పాదరసం వంటి రాజకీయ వాది. గాలివాటుకు అనుకూలంగా తెరచాపను తిప్పగల నైపుణ్యం, అవసరమైతే కొండను కూడా ఢీకొనగల స్థైర్యం కల్గినవాడు. చాలా క్రిందిస్థాయి నుంచి ఉన్నతికి ఎదిగిన వాడు కాబట్టి, కార్యకర్తల మనోభావాలు బాగా తెలుసు. ఇంతకాలం జీవంలేని జడ పదార్థం వలె వుండిన కాంగ్రెస్ పార్టీలో కొత్త ఉత్సాహాన్ని నింపగలడన్న నమ్మకం కాంగ్రెస్ వాదులలో కల్గుతున్నది. ఆయన నియామక వార్త వెలువడగానే రాష్ట్రం మొత్తం మీద కాంగ్రెస్ వాదులలో కన్పించిన సంతోషభావానికి కారణమదే.

రెడ్ల మీద విరక్తి

అయితే జగన్ ఉధృతి, తెలంగాణ ఉద్యమ తీవ్రతల నేపథ్యంలో సత్తిబాబును ఈ కీలక పదవికి ఎందుకు ఎంపిక చేశారన్నది ప్రశ్న. వైఎస్ జగన్ దూకుడును నిరోధించాలంటే, దీపం వెలుతురుకు పురుగుల వలె జగన్ వైపుకు ఆకర్షితులౌతున్న రెడ్డి యువతను తిరిగి రాబట్టుకోవాలంటే, కీలక స్థానాలలో రెడ్డి నేతలనే నియమించాలనే సిద్ధాంతం ఒకటి కాంగ్రెస్ పెద్దలలో వుండేది. కిరణ్‌కుమార్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడంలోని ఉద్దేశం అదే. కానీ ఆ తర్వాత జరిగిన పరిణామాలు, కడప ఉప ఎన్నికలలో జగన్‌కు వచ్చిన భారీ మెజారిటీతో రెడ్ల మీద కాంగ్రెస్ పెద్దలకు విరక్తి కలిగినట్లుంది. ముఖ్యమంత్రి రెడ్డి, కడప, పులివెందుల అభ్యర్థులు రెడ్లు, మంత్రివర్గంలో 14 మంది రెడ్లున్నారు. అయినా

కొరవ 14వ పేజీలో



ఎందుకంత భయం?

నల్లధనం నిర్మూలనకు బాబా రామ్‌దేవ్ చేపట్టిన నిరసన దీక్షను చూసి కేంద్ర ప్రభుత్వం భయపడిన తీరు ఆశ్చర్యం కల్గిస్తుంది. ప్రజాస్వామ్యంలో నిరసన దీక్షలు సర్వసాధారణ విషయాలు. గ్రామ పంచాయితీ స్థాయి నుంచి ఢిల్లీ వరకు ఎన్నో వర్గాల ప్రజలు ఎన్నెన్నో సమస్యల మీద దీక్షలు చేపడుతూ వుంటారు. వాటిలో కొన్నిటికి ప్రభుత్వాలు స్పందిస్తాయి. కొన్నిటిని పూర్తిగా విస్మరిస్తాయి. కానీ రామ్‌దేవ్ బాబా దీక్ష ప్రకటన చేసినప్పటి నుంచి ప్రధానితో సహా కేంద్ర మంత్రివర్గం యావత్తు ఏదో ఉత్పాతం ముంచుకొని వస్తున్నట్లుగా భీతి చెందడం విచిత్రం.

రామ్‌దేవ్ బాబా రాజకీయవాది కాదు. ఆధ్యాత్మిక వాది అసలే కాదు. సాధారణ యోగా గురువు మాత్రమే. ఆయనలో రాజకీయ ఆకాంక్షలు వుండవచ్చు. రేపటి ఎన్నికలలో దేశమంతా తన అభ్యర్థులను నిలపాలనే ఆలోచన కూడా వుండవచ్చు. కానీ ఆయనకు సాధారణ జనంలో పిసరంత పలుకుబడి లేదు. యోగా అనేది సమాజంలో చాలా తక్కువ శాతం మందికి మాత్రమే పరిచయమైన అభ్యాసం. రాజకీయం కోట్లాది మంది జన సామాన్యానికి సంబంధించిన అంశం. రామ్‌దేవ్ బాబా వంటి వారు రాజకీయాలకు వచ్చినంత మాత్రాన ఏదో భూకంపం పుట్టుకొని వస్తుందని భావించేవారు ఎవరూ లేరు. నూట పాతికేళ్ల చరిత్ర కల్గిన కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీలు ఇటువంటి పరిణామాలను అసలే లెక్కించవు.

కానీ కేంద్ర సర్కారు మాత్రం రామ్‌దేవ్ బాబాను చూసి గడగడ వణికిందని చెప్పక తప్పదు. ఆయన దీక్ష ప్రకటన చేసిన నాటి నుంచి వారిలో ఆందోళన చెలరేగింది. ఢిల్లీకి వచ్చే సమయానికి అరడజను మంది కేంద్ర మంత్రులు ఎయిర్‌పోర్టులో పడిగాపులు కాసారు. పార్టీలో అత్యంత సీనియర్ నేత ప్రణబ్ ముఖర్జీ కూడా తన అహం, అధికార దర్పం పక్కన పెట్టి, ఎయిర్‌పోర్టుకు వెళ్లాడు. అందరూ కలిసి పలు రకాలుగా ప్రాధేయపడ్డారు. కానీ రామ్‌దేవ్ బాబా మాట వినలేదు. దానితో పోలీసు బలగాలను ప్రయోగించి, దీక్షలో పాల్గొంటున్న వారిపై అత్యంత క్రూరంగా లాఠీలు ఝళిపించి మరీ దీక్షను భగ్నం చేశారు.

రామ్‌దేవ్ బాబాను చూసి కేంద్ర ప్రభుత్వం ఎందుకంత భయపడి పోయిందన్నది ప్రశ్న. ఆ భయం బాబాను చూసి కాదు. బాబా చేపట్టిన ఆందోళన అంశాన్ని చూసి అన్నది నిజం. ప్రభుత్వ వ్యవహారాలలో మితిమీరిపోయిన అవినీతి పట్ల ప్రజలలో ఆగ్రహం పెల్లుబుకుతున్నది. అన్నా హజారే దీక్ష విజయవంతమైన తీరు అందుకొక నిదర్శనం. అన్నా హజారే మీద కానీ, బాబా రామ్‌దేవ్ మీద కానీ ప్రజలకు భ్రమలేవీ లేవు. కానీ తమ మనసులను తొలుస్తున్న సమస్య మీద పోరాటానికి వారు ముందడుగు వేయడంతో ప్రజలు స్వచ్ఛందంగా వారి అడుగులో అడుగు వేయడానికి సిద్ధపడుతున్నారు. ఇదొక నిశ్శబ్ద సామాజిక విప్లవం. రాజకీయవాదులు, రాజకీయ పార్టీలు, అవి నడిపే ప్రభుత్వాల పట్ల ప్రజలు వెలిబుస్తున్న కోపానికి ఒక సంకేతం. లక్షల కోట్ల రూపాయల 2జి స్పెక్ట్రం స్కాం, కామన్‌వెల్త్ గేమ్స్ స్కాం పురాణం, ఆదర్శ్ అపార్ట్‌మెంట్ నిర్మాణాలలో అవినీతి తదితరాలలో రాజకీయవాదుల ప్రమేయం వెల్లడైన తీరు, వాటిని కప్పిపెట్టడానికి మహా నీతిమంతుడైన వాడిగా చెప్పుకొనే మన్మోహన్‌సింగ్ సైతం ప్రయత్నించిన వైఖరి ప్రజలలో రాజకీయ వ్యవస్థ మీదనే ద్వేషం కల్గిస్తున్నది. ఆ అవినీతి మూలాలను పెకలించడానికి ముందుకొచ్చే వారి వెనుక నిలబడడానికి సాధారణ ప్రజానీకం తెగబడుతున్నది. వీధులలోకి రావడానికి సిద్ధపడుతున్నది. ఈజిప్ట్‌లో జరిగింది అదే. ఆ సామాజిక విప్లవం మనదేశంలో కూడా పురుడు పోసుకొంటుందేమో అన్న భయం పాలకులలో కలవరం సృష్టిస్తున్నది. తమ కుర్చీల పునాదులు కదలి పోతాయని హడలిపోతున్నారు వారు.

ఈ నిరసన దీక్షలపై కాంగ్రెస్ ప్రతినిధులు, ప్రభుత్వంలోని మంత్రులు చేస్తున్న ప్రకటనలు, వ్యాఖ్యలు చూస్తుంటే ఇందిరమ్మ కాలం నాటి ఎమర్జెన్సీ రోజులు గుర్తుకు వస్తున్నాయి. సమాజంలో అవినీతి, అధికార దుర్వినియోగాలపై సర్వోదయ నేత జయప్రకాష్ నారాయణ చేపట్టిన ఉద్యమం విషయంలో ఇందిరమ్మ ఇదే తీరులో మాట్లాడింది. ఆ అసహనంతో, ఆయన్ను ఎట్లా అడ్డుకోవాలో తెలియని అయోమయంలో ఎమర్జెన్సీ ప్రకటించింది. కాంగ్రెస్ నేతలు మరొకసారి అటువంటి పొరపాటు పనిచేస్తారా అన్న భావన కల్గుతున్నది. అదే జరిగితే కాంగ్రెస్‌కు అదే మరణ శాసనం కావడం ఖాయం.

జమీన్‌రైతు

జనవాక్కు

మంచివారిని ఎన్నుకోండి!

స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమయ్యింది. ఓటర్ల జాబితాలు సిద్ధమయ్యాయి. కాంగ్రెస్, తెలుగుదేశం, వైఎస్ఆర్ కాంగ్రెస్, బిజెపి, సిపిఎం, లోక్‌సత్తా తరపున పోటీ చేయను పలువురు సిద్ధమవుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో పార్టీ రహితంగా ఉత్తమ వ్యక్తులను ఎన్నుకొంటే బాగుంటుంది. దీనివల్ల మంచి జరగకున్నా చెడు మాత్రం జరగదు. అలా కాకుండా అవినీతిపరులు, అసమర్థులను ఎన్నుకొంటే గత కార్పొరేషన్ పాలనను గుర్తుకు తెస్తారు.

వాస్తు రామచంద్ర నెల్లూరు

గ్రేడింగ్ ఎందుకు?

ఈ యేడాది టెన్త్ పరీక్షా ఫలితాలను గ్రేడింగ్ పద్ధతిలో విద్యాశాఖ విడుదల చేసింది. గ్రేడ్‌లను విడుదల చేసిన కొద్ది గంటలకే ఇంటర్‌నెట్ ద్వారా విద్యార్థుల మార్కులను విడుదల చేయడం వల్ల గ్రేడింగ్ విధానానికి అర్థం లేకుండా పోయింది. యధావిధిగా ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు తమ ఫలితాలను టీవీల ద్వారా హోరెత్తించాయి. గ్రేడింగ్ విధానం ప్రైవేటు విద్యా సంస్థల ప్రచారాన్ని అడ్డుకోను రూపొందించింది. కాని ఇది ఆచరణలో విఫలమయ్యింది.

దోగిపర్తి సత్యం నెల్లూరు

ప్రభుత్వానికి సిగ్గేయడం లేదా?

ఈ యేడాది ప్రకటించిన ఇంటర్మీడియేట్, పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో కార్పొరేట్ విద్యాసంస్థల హవా నడిచింది. ర్యాంకులన్నీ వీళ్లకే వచ్చాయి. మెరుగైన ఫలితాల సాధనలో ప్రభుత్వ విద్యా సంస్థలు వీరితో పోటీ పడలేక పోయాయి. విద్యా విధానాన్ని కార్పొరేట్ సంస్థలు శాసించే స్థాయికి ఎదగడంలో ప్రభుత్వ పాత్ర ఎక్కువ. ప్రభుత్వ విద్యాసంస్థలను తీవ్రంగా నిర్లక్ష్యం చేయడం, అరకొర వసతులు, నిధుల లేమి, సిబ్బందిపై పర్యవేక్షణ కొరవడడంతో ప్రభుత్వ విద్యాసంస్థలు వెనుకబడిపోయాయి.

పి.అరుణకుమారి నెల్లూరు

ఉద్యోగుల బదలీలు

ప్రతి యేడాది మే, జూన్ నెలల్లో వుద్యోగుల బదలీలు జరుగుతాయి. బదలీలు వుద్యోగుల సంక్షేమం కొరకు ఏర్పాటు చేయబడ్డాయి. అయితే బదలీలు విమర్శలకు తావు లేకుండా చూడాలి. ఐదేళ్లకు మించి ఒకచోట పని చేస్తున్న వుద్యోగులను ఖచ్చితంగా బదలీ చేయాలి. తమ స్వంత జిల్లాలో మూడేళ్లకు మించి పనిచేస్తున్న గెజిటెడ్ అధికార్లను ప్రజాసంక్షేమం దృష్ట్యా బదలీ చేయాలి. కుటుంబసభ్యుల అనారోగ్యం, భార్యభర్తలు ఒకేచోట పని చేసే అవకాశాలను

కొరవ 14వ పేజీలో

70 ఏళ్ల క్రితం ఈవారం

13-6-1941
పేజీలు : 10 వెల: అణా

నెల్లూరులో కుమ్మరి సమ్మె

నెల్లూరులో అనాది నుంచి కుమ్మరి వాండ్లు కుమ్మరి వీధిలో వాండ్ల వాండ్ల ఇండ్ల వద్ద కుండలు కాలుస్తూ వచ్చినారు. ఇప్పుడు మునిసిపాలిటీ వారు పొగ రాకుండా కట్టెలతో కాల్చవలసిందేగానీ పొట్టు పోసి కాల్చకూడదని ఉత్తర్వు చేయగా కుమ్మరి వాండ్లు సమ్మెజేసి కుండలు పగైరాలు అమ్మడం లేదు.

మునిసిపాలిటీ వారు చాకలి, కుమ్మరి ఇలాంటి ఉపకారులకు ప్రత్యేకంగా చోట్లు ఏర్పరచి వారి చేత సక్రమంగా ప్రజాసేవ చేయించడం అత్యవసరం. దీని విషయమై మునిసిపాలిటీ వారు తక్షణం శ్రద్ధ వహించి తగు చర్య తీసుకోవడం మంచిది.

నెల్లూరు ముచ్చట్లు
ఆనకట్ట వద్ద లైటు

ఆనకట్ట వద్ద ఏట్లోకి దిగే తిరుగట్లో రాత్రులు లైటు లేనందున చాలా ప్రమాదం. మొన్నొక బండి కూడా పడ్డదట.

లైటు పెట్టమని ఎవరినడగడం! టవున్ మీద సర్వాధిపత్యాలు గల్గిన మునిసిపాల్టీ వారు మా లిమిట్‌కు వెలుపల ఉందిగాన మాకు సంబంధం లేదంటారు. రోడ్ల మీద సర్వ హక్కులు చెలాయించే జిల్లా బోర్డు వారు దీపాలు బెట్టే పని మాది గాదంటారు. అగస్త్యుని మాదిరి పెన్నోదకాన్ని ఆపోసనం బట్టే పిడబ్ల్యుడి వారు లైట్ల విషయంలో మాకు సంబంధం లేదంటారు. ఇక నెవరినడగాలండీ!

50 ఏళ్ల క్రితం ఈవారం

9-6-1961
పేజీలు: 12 వెల: 0-20 న.పై

జోర్డాన్ రాజు రెండవ పెండ్లి

16 లక్షల జనం గల జోర్డాన్ దేశపు పాతికేళ్ల వయస్కుడైన రాజు హుస్సేన్, 20 ఏండ్ల బ్రిటిష్ యువతి టోని ఆర్విన్ గార్డినర్‌ను రెండవ పెండ్లి చేసుకొన్నాడు.

ఈ పెండ్లికి జోర్డాన్ మంత్రివర్గము, హుస్సేన్ తల్లి సుతరాము సమ్మతించలేదు. హుస్సేన్ పట్టు విడువ లేదు. అవసరమైతే రాజ్యపరిత్యాగం చేస్తానని బెదిరించాడు. కానీ క్రొత్త పెండ్లి కూతురు తాను పట్టపురాణిగా గాక హుస్సేన్ ప్రియురాలిగా వుండుటకు సమ్మతించగా, వారి వివాహానికి అందరి అనుమతి లభించింది.

హుస్సేన్ మొదటి భార్య దీనా అతనికంటే ఏడేండ్లు పెద్ద. అతనికంటే పొడవు. అతని కంటే ఎక్కువ (ఎం.ఏ) చదువుకున్నది. క్రొత్త పెండ్లి కూతురు హుస్సేన్ కంటే ఐదేళ్లు చిన్నది. నాలుగు అంగుళాలు పొడవు తక్కువ. అతని వలెనే ఆమెకూ డిగ్రీలు లేవు.

సామాన్య పౌరునికి సింహాసనాధికారం

బ్రిటిష్ రాణి ఎలిజబెత్ చెల్లెలు మార్గరెట్ రాకుమారి ఈ అక్టోబరులోనో, నవంబరులోనే తల్లి కాబోతున్నది. ఈమె భర్త ఆంటోని ఆర్మ్‌స్ట్రాంగ్ బోన్సు ఫోటోగ్రఫి వృత్తిలో వుండి రాకుమారిని చేపట్టిన అదృష్టవంతుడైన సామాన్య పౌరుడు. వీరికి కలిగే సంతానం బ్రిటిష్ సింహాసనానికి వారసత్వపు వరుసలో ఐదవ వారుగా వుంటారు. ఏనాడైనా రాజరిక బిరుదులు లేని సామాన్యుడు సింహాసనాన్ని అధిష్టిస్తాడేమోనని బ్రిటిష్ రాచరికుల భయం.

ఆర్మ్‌స్ట్రాంగ్ బోన్సు ఆస్తిపాస్తులు లేని వాడు కాబట్టి, మార్గరెట్ వార్షిక భృతి రూ.84వేల నుండి రూ.2 లక్షల పదివేలకు పెంచింది పార్లమెంటు.

నెల్లూరు ముచ్చట్లు

సీతారామయ్య పదవీ విరమణ

అదనపు జాయింట్ కలెక్టర్ టి.సీతారామయ్య ఈ నెలాఖరుకు పదవీ విరమణ చేయనున్నారు. కార్పొరేషన్ ప్రత్యేకాధికారిగా కూడా వ్యవహరిస్తున్న సీతారామయ్య స్థానంలో ప్రభుత్వం ఓ మంచి ఐఏఎస్ అధికారిని నియమిస్తే కార్పొరేషన్ పాలన గాడిన పడుతుంది.

కలక్టర్‌ను చేరుకొన్న పవర్ బ్రోకర్స్!

పాత కలెక్టర్ రాంగోపాల్‌కు అన్నీ తామై వ్యవహరిస్తుండిన పవర్ బ్రోకర్స్‌లో ఇద్దరు కొత్త కలెక్టర్ బి.శ్రీధర్‌రెడ్డి దర్బార్‌లోనికి ప్రవేశించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. మొదట కలెక్టర్‌గారు పవర్ బ్రోకర్స్ ఎవరినీ తన గడప తొక్క నీయలేదు. ప్రస్తుతం ఎందుకు మనసు మార్చుకొన్నారన్నది చర్చనీయాంశంగా మారింది.

జైలులో కలెక్టర్ పరిశీలన

నెల్లూరు సెంట్రల్ జైలు పర్యవేక్షణాధికారి ప్రసాదరావుపై మీడియాలో వచ్చిన వార్తల నేపథ్యంలో కలెక్టర్ బి.శ్రీధర్‌రెడ్డి 6వ తేది జైలును సందర్శించి అన్ని విభాగాలు పరిశీలించారు. జైలు పర్యవేక్షణాధికారి త్వరలో పదవీ విరమణ చేస్తుండడంతో సుతిమెత్తగా ఆయన్ను మందలించినట్లు తెలిసింది. అయితే కలెక్టర్ జైలును సందర్శిస్తారని ముందుగా పోబిడి అందడంతో ప్రసాదరావు చిన్న చిన్న లోపాలు కూడా బయట పడకుండా జాగ్రత్తలు తీసుకొన్నట్లు తెలిసింది.

వర్షం

పగటి పూట 42 సెంటీగ్రేడు డిగ్రీల ఎండ, తీవ్ర ఉక్కపోత నడుమ జనం ఒక ప్రక్క అల్లాడిపోతుండగా సాయంత్రాల పూట సేదతీర్చనున్నట్లు 2, 5, 6, 7వ తేదీల్లో నగరంలో వర్షం పడింది. గాలివానను తలపింపజేస్తున్నట్లు తీవ్రమైన గాలులు ఆ తర్వాత పడుతున్న వర్షానికి జనం హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడ్డాక ఎండ తగ్గాల్సిందిపోయి పెరగడం విశేషం.

గాంధీబొమ్మ దగ్గర మురికి మడుగు!

చిన్నపాటి వర్షం కురిస్తేచాలు ట్రంకురోడ్డులోని గాంధీబొమ్మ సెంటర్‌లో చిన్నవాగు ప్రవహించినట్లు మురికి నీళ్లు ప్రవహిస్తున్నాయి. వేదాయపాళెం సెంటర్ నుంచి నిప్పో ఫ్యాక్టరీ వరకు రోడ్డు మధ్యలో డివైడర్ పేరిట కట్టిన పెద్ద అడ్డుగోడ దెబ్బ నీళ్లు నిలబడి పోతున్నాయి. ఇప్పుడే తగిన చర్యలు తీసుకొని సరిదిద్దకపోతే వర్షాకాలంలో జనం నానాపాట్లు పడవలసి వస్తుంది కార్పొరేషన్ అధికారులారా?

కలెక్టర్ టాస్క్‌ఫోర్స్

జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలు పర్యవేక్షణకు జిల్లా కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి 17 మంది జిల్లా అధికారులతో టాస్క్ ఫోర్సును ఏర్పాటు చేశారు. మూడు మండలాలకు ఒక్కరు చొప్పున జిల్లాస్థాయి అధికారులు ఈ టాస్క్‌ఫోర్స్‌లో వుంటారు. పాఠశాలలు, అంగన్‌వాడీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లు, వసతి గృహాల నిర్వహణ తీరును తనిఖీచేసి ప్రతి శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు ఒక నివేదిక ఇస్తారు. కలెక్టర్ చేస్తున్న కొత్త ప్రయోగం సఫలం కావాలని కోరుకొందాం.

పార్టీలకే ఓటు

కోవూరు శాసనసభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి గెలిచిన పార్టీలకు విరుద్ధంగా రాజకీయ కార్యకలాపాలు నిర్వహిస్తున్న విషయం విదితమే. కానీ 4వ తేది జరిగిన అసెంబ్లీ స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నికల్లో వీరిద్దరు స్వంత పార్టీలు జారీచేసిన విప్‌లకు అనుగుణంగా ఓటు వేశారు. లేకుంటే వీరిద్దరిపై అనర్హత వేటు పడి పోయేది.

టీచర్ల కౌన్సిలింగ్‌లో రభస!

నెల్లూరు సిఏఎం హైస్కూల్‌లో జరుగుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయుల బదలీ కౌన్సిలింగ్‌లో రోజుకో రచ్చ జరుగుతుంది. ఉపాధ్యాయ సంఘాలు డిఇఓను లెక్కచేయకుండా మాట్లాడడం, ఉపాధ్యాయులు కూడా తమకు అనుకూలమైన బదలీల కోసం తప్పుడు సర్టిఫికేట్లు దాఖలు చేస్తుండడంతో ఈ వ్యవహారంలో గందరగోళాలు తప్పడం లేదు.

జాయింట్ కలెక్టర్‌కు కోపమొచ్చింది!

ప్రశాంతవదనుడైన జాయింట్ కలెక్టర్ సౌరభ్‌గౌర్‌కు పట్టరానంత కోపమొచ్చింది. ఈ వారంలో సూళ్లూరుపేట తహశీల్దార్ కార్యాలయ సాధారణ తనిఖీకి వెళ్లిన ఆయనకు రోజుల తరబడి ప్రజావిజ్ఞప్తులు పరిష్కరించని విషయం బయట పడింది. పట్టాదారు పాసుపుస్తకాలు విఆర్వో వ్రాసి వుండడాన్ని చూసి ఆశ్చర్యపోయారాయన. అండగళ్ వ్రాయలేని వాడివి ఎలా ఎమ్మార్వో అయ్యావని ఆయన అధికారిపై విరుచుక పడ్డాడు. భూస్వాముల కోసం కాకుండా సామాన్య ప్రజల కోసం పనిచేయమని జెసి అక్కడి ఎమ్మార్వో కార్యాలయ సిబ్బందికి హితవు చెప్పి వచ్చారు.

కసుమూరు దర్గాలో దుస్థితి!

కసుమూరు దర్గా చుట్టుప్రక్కల ప్రాంతాల అభివృద్ధికి బిజెపి నేత వెంకయ్య నాయుడు ఎంతగానో శ్రమించారు. కానీ దర్గా పరిసర ప్రాంతాలను శుభ్రంగా వుంచడంలో దర్గా నిర్వాహకులు విఫలమౌతున్నారు. భక్తులు దర్గాలోనికి ప్రవేశించే ముందు కాళ్లు కడుక్కోను సరైన నీటి వసతి లేదు. అదే విధంగా మొక్కులు తీర్చుకొనే భక్తులు కేశ ఖండన(గుండు) చేయించుకునే చోట పరమ అసహ్యంగా వుంది. గుండు తీయించుకున్న వారు స్నానం చేయను రూములు బాడుగకు తీసుకోవాల్సిందే. గుండు చేయించుకునే భక్తుల వద్ద ప్రత్యేక రుసుం వసూలు చేస్తున్న దర్గా నిర్వాహకులకు ఇక్కడ కనీస వసతులు కల్పించాలన్న జ్ఞానం లేకపోవడం బాధాకరం.

సిఐటియు నగర కార్యదర్శిగా కత్తి!

సిపిఎం పార్టీలో చురుకైన యువ నేతగా గుర్తింపు పొందిన కత్తి శ్రీనివాసులును సిఐటియు నగర కార్యదర్శిగా జిల్లా కార్యదర్శి ఎం.మోహన్‌రావు నియమించారు. రైసు మిల్లులు, బీడి పరిశ్రమలోని ఐదువేల మంది కార్మికుల సమస్యలకు పరిష్కారమార్గం వెతుకుతానని శీనయ్య చెబుతున్నాడు.



జొన్నవాడలోని మల్లికార్జునస్వామి సమేత కామాక్షమ్మ కళ్యాణోత్సవ దృశ్యం.

బొత్స బెస్ట్

పిసిసి అధ్యక్షునిగా బొత్స సత్యనారాయణ నియామకం పట్ల రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అందరికీ ఆమోదయోగ్యమైన బొత్స సత్యనారాయణ సారధ్యంలో పార్టీ మరింత బలోపేతమవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీలో కీలక పదవుల భర్తీకి సీజన్ మొదలయ్యిందని కార్యకర్తల్లో ఉత్సాహం నింపను ఊరిస్తూ మాట్లాడారు.

రోడ్డు ప్రమాదం

మైపాడుగేటు ప్రాంతం నుంచి ఆత్మకూరు బస్టాండ్‌కు స్కూటర్‌పై వెళ్తున్న తల్లీ కొడుకులు లక్ష్మీదేవమ్మ, గురువారెడ్డిలను 3వ తేది ఆటోను తప్పించబోయిన ట్రాక్టర్ డివైడర్ ఎక్కి మరి ఢీ కొట్టడంతో ఇద్దరూ అక్కడికక్కడే మరణించారు.

విద్యార్థికి మూడు చక్రాల మోపెడ్!

ఈ యేడాది రిపబ్లిక్ దినోత్సపు పెరేడ్‌లో అదుపుతప్పిన ప్రభుత్వ శకటం మూలంగా కాలుపోగొట్టుకొన్న చిన్న చెరుకూరు విద్యార్థి షేక్ అజీజ్‌కు కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి మానవతా దృక్పథంతో 60వేలు వెచ్చించి తయారుచేయించిన మూడు చక్రాల మోటారు సైకిలును

కొరవ 14వ పేజీలో

బంగారం స్పెషల్ ఆఫర్
BIS 916 హాల్‌మార్క్ బంగారు ఆభరణములపై సవరకు రూ.400/- తగ్గింపు.
గ్రాముకు రూ.50/- తగ్గింపు.
డైమండ్స్ పై 10% తగ్గింపు.
గోల్డ్ ప్యాలెస్
హోటల్ శివం ఎదురుగా, జిల్లా పరిషత్ ఆఫీసు సెంటర్, ఆచారివీధి, నెల్లూరు.
ఫోన్: 2331133, 2327611

గొప్ప ప్రారంభం
తేది: 20-6-2011
సిల్వర్ ప్లాజా
EXCLUSIVE SILVER SHOW ROOM
A Unit of GOLD PALACE
ఆంధ్రలోనే అతి పెద్ద వెండి మెగా షోరూం
హోటల్ శివం ఎదురుగా, ఆచారివీధి, జిల్లా పరిషత్ సెంటర్, నెల్లూరు.
ఫోన్ : 2331132, 2331121

విజయ లేబొరేటరి
ఒబేసిటీ క్లినిక్ - 2000 & హెల్త్‌కేర్ - నెల్లూరు
- మా విజయ లేబొరేటరి 26వ వార్షికోత్సవం సందర్భంగా (స్థాపితం: జూన్16, 1985) అందరికీ మా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనములు.
- స్థూలకాయులకు ఉచితంగా కౌన్సిలింగ్ చేయబడును. అధికబరువు & లావు తగ్గింపు మరియు అన్ని రోగనిర్ధారణ పరీక్షలపై 20% డిస్కౌంట్ ఇవ్వబడును. ఈ సదావకాశం కొద్ది రోజులు మాత్రమే.
- ప్రత్యేకమైన రోగ నిర్ధారణ & హార్మోనల్ పరీక్షల రిపోర్టులు ఆన్‌లైన్ ద్వారా 48 గం॥లలో ఇవ్వబడును.

వివరములకు సంప్రదించండి
డా॥ యం.పెంచలరెడ్డి, యండి., డిసిపి.,
రోగనిర్ధారణ శాస్త్రవేత్త & స్థూలకాయం వైద్య నిపుణులు
శ్రీమతి యం.అరుణ, మేనేజింగ్ డైరెక్టర్
డా॥ యం.హరికృష్ణారెడ్డి, MBBS., (DNB., Plastic Surgery)
డా॥ శ్రీమతి యం.విజయలక్ష్మి, MBBS., (MD., Pathology)
డా॥ యం.రాజశేఖర్‌రెడ్డి, MBBS., (DNB., Paediatrics)
విజయ లేబొరేటరి & వెల్‌నెస్ క్లినిక్ చిరునామా
16-5-60 (Old16/710A) ఇందిరాభవన్‌రోడ్డు, హోటల్ చిన్ని ఇంటర్‌నేషనల్ ఎదురు, నెల్లూరు -524 001. ఫోన్: 0861-2324405; సెల్: 9866534908
E-mail: obesityclinic2000@yahoo.co.in

● నెల్లూరు సినిమా హాళ్లలో దుర్భర పరిస్థితులు

ప్రేక్షకుల నరకయాతన!



నగరంలోని సినిమా హాలులో మూత్రశాలల దుస్థితి.

అధికారుల ఆర్భాటపు ప్రకటనలు అంతవరకే పరిమితమవుతున్నాయి తప్ప ఎలాంటి ఫలితం వుండడం లేదు అనేందుకు సినిమా హాళ్లే నిదర్శనం. నగరంలోని సినిమా హాళ్ల యజమానులు ప్రేక్షకుల నుంచి టిక్కెట్ పేరుతో అధిక ధరలు వసూలు చేసుకోవడం తప్ప కనీస సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కూర్చొనే సీట్లు సౌకర్యంగా వుండవు. చాలా వరకు హాళ్లలో సీట్లు పాడైపోయి నల్లుల బాధ ప్రేక్షకులను ఇబ్బందికి గురి చేస్తుంది. ఒకటి రెండు హాళ్లు మాత్రం ఇందుకు మినహాయింపు. థియేటర్లలో విక్రయించే తినుబండారాలు మాత్రం సామాన్య ప్రేక్షకుడికి దడ పుట్టిస్తున్నాయి. రెండు మూడింతలు అధికంగా ధర వసూలు చేస్తున్నారు నిర్వాహకులు. టాయిలెట్ల గురించి చెప్పనే పన్లేదు. సక్రమంగా శుభ్రపరచక పోవడంతో దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఇక వేసవిలో థియేటర్‌కు వెళ్లే వారికి భరించలేని ఉక్కపోత సినిమాపై దృష్టి సారించనీయడం లేదు. పేరుకు అన్నీ ఎసి సినిమాళ్లే అయినా అధిక భాగం హాళ్లలో ఎసి వేయరు. ప్రారంభంలో వేసినా సినిమా మధ్యలో నిలిపి వేయడం లేదా, రిపేర్లంటూ బోర్డులు పెట్టేసి చేతులు దులుపు కొంటున్నారు. అగ్ర నటీనటుల సినిమాలకు మూడు రోజులపాటు టిక్కెట్ల విక్రయాలు ఎక్కువ భాగం డిస్ట్రిబ్యూటర్లు, హాళ్ల యాజమాన్యాలు ముందుగా అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకొంటున్నారు తప్ప సగటు ప్రేక్షకుడికి కౌంటర్లలో టిక్కెట్లు ఇవ్వడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో జాయింట్ కలెక్టర్ సౌరభ్‌గౌర్ అధికారులను పిలిచి థియేటర్లను తనిఖీ చేయాలని, నిబంధనలు పాటించని, అధిక ధరలకు తినుబండారాలను అమ్మే వారిపై చర్యలు చేపట్టాలని పదే పదే ప్రకటిస్తున్నా అది ఆచరణకు నోచుకోవడం లేదు. పై పెచ్చు ఈ ప్రకటన రెవిన్యూ అధికారులకు డబ్బులు గుంజేందుకు వీలు కల్పిస్తోంది తప్ప ప్రయోజనం వుండడం లేదు.

టెట్ పేరుతో అగ్నిపరీక్ష

○ పాపం నిరుద్యోగ ఉపాధ్యాయులు

టీచర్ ఉద్యోగం కోసం ఉపాధ్యాయ కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులకు కొత్త చిక్కులొచ్చి పడ్డాయి. ప్రభుత్వం క్రొత్తగా టీచర్ ఎలిజిబిలిటీ టెస్టు(టెట్)ను ఈ ఏడాది నుంచి నిర్వహించాలని భావించడం వీరికి ఆందోళన కల్గిస్తోంది. డిఎడ్, బియిడి చేసిన అభ్యర్థులు డిఎస్సీ వ్రాసి దానిలో వచ్చిన మార్కులు, మెరిట్ ఆధారంగా ఉపాధ్యాయులుగా నియమితులయ్యే వారు. ఈ దఫా ప్రభుత్వం మొట్టమొదటి సారిగా ఈ టెట్‌ను ప్రవేశ పెట్టడంతో అభ్యర్థులు దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. జూలై నెలలో ఈ పరీక్ష నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుండగా డిఎడ్, బియిడి పూర్తిచేసిన అభ్యర్థులు మాత్రం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టెట్‌లో అర్హత సాధించిన వారే డిఎస్సీ వ్రాసేందుకు అర్హులుగా ప్రభుత్వం నిబంధనలు పెట్టడంతో ఇవి ఆయా అభ్యర్థుల పాలిట అశనిపాతంలా మారుతోంది. డిఎస్సీ వ్రాసి ఉపాధ్యాయులుగా ప్రభుత్వ ఉద్యోగం చేసేందుకు ఎదురుచూసే నిరుద్యోగులను ఈ పరీక్ష మరింతగా కృంగదీయడమే తప్ప దీని వల్ల ఎలాంటి ప్రయోజనం వుండదని ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దీనిని రద్దుచేసి పాత పద్ధతిలోనే డిఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఎంపికలు చేయాలని పలువురు బియిడి అభ్యర్థులు కోరుకొంటున్నారు.

నేషనల్ హైవే నిర్వహణ అధ్వాన్నం

టోల్ ఫీజులపైనే దృష్టి



డివైడర్‌పై చెట్లులేని దృశ్యం.

జిల్లాలో టోల్‌ప్లాజా నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాల యజమానుల వద్ద నుంచి టోల్ ఫీజులు ముక్కుపిండి వసూలు చేస్తున్న నిర్వాహకులు వాహనాలు నడిపేవారికి ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూడడంలో మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండడంతో తరచూ ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత పడుతున్నారు. రోడ్డు మధ్య ఏర్పాటుచేసిన డివైడర్లపై ఎత్తుగా చెట్లను పెంచాలి. వాహనాల హెడ్‌లైట్లు ఒకదాని మీద మరొకటి పడకుండా వుండేందుకు ఈ చెట్లను పెంచుతారు. కానీ ఎక్కడా ఎత్తైన చెట్లు కన్పించడం లేదు. చిన్న చిన్న మొక్కలు మాత్రమే పెంచి వున్నారు. రెండు వైపులా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సి వుండగా అలాంటి చర్యలేవీ చేపట్టకపోవడంతో జాతీయ రహదారిపై పశువుల సంచారం అధికంగా వుంటోంది. ఇవి ఒకవైపు నుంచి మరోవైపుకు వచ్చే సందర్భంలో వేగంగా వెళ్తున్న వాహనాలు పశువులను తప్పించే సమయంలో అదుపు తప్పి ప్రమాదాలకు గురౌతున్నాయి. మరోవైపు వాహనాలు ప్రమాదానికి గురైన వెంటనే క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్సును, వాహనాలను ప్రక్కకు జరిపి ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు క్రేన్‌లు సిద్ధంగా వుంచుకోవాల్సిన విషయాన్ని టోల్‌ప్లాజాల నిర్వాహకులు మరచిపోయి కేవలం టోల్ ఫీజు వసూలు చేసుకోవడం పైనే దృష్టిసారించడం ప్రమాదాలు జరగడానికి కారణాలవుతున్నాయి.

చుట్టుముట్టిన సమస్యలు



అగ్నిమాపక శాఖ బయటపడేనా?

జిల్లా అగ్నిమాపక శాఖ సమస్యలతో సతమతమవుతోంది. స్టేషన్లు, సిబ్బంది కొరతకు తోడు కొందరు కాసులకు కక్కుర్తిపడి నో అబ్జెక్షన్ సర్టిఫికేట్లను నిబంధనలకు విరుద్ధంగా అందజేస్తుండడంతో శాఖాపరంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో ఇటీవల కాలంలో అధికంగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు సంభవిస్తున్నా తగినంత సిబ్బంది, సమీప ప్రాంతాల్లో ఫైర్ స్టేషన్లు లేనికారణంగా సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకోలేక పోతున్నారు. నేషనల్ ఫైర్ అడ్వైజరీ కమిటీ సూచనల ప్రకారం 50వేల జనాభా లేదా పది కిలోమీటర్ల పరిధిలో ఒక ఫైర్ స్టేషన్ వుండాలి. ప్రస్తుతం జిల్లాలో కావలి, వింజమూరు, నెల్లూరు, సూళ్లూరుపేట, కోట, వెంకటగిరి, ఉదయగిరి, రాపూరు, గూడూరు, నాయుడుపేట, ఆత్మకూరు ప్రాంతాల్లో 12 స్టేషన్లు మాత్రమే వున్నాయి. మరిన్ని ఫైర్ స్టేషన్లు అవసరం. దీనికితోడు సిబ్బంది కొరత వుంది. ప్రతి ఫైర్ స్టేషన్‌కు ఒక ఫైర్ ఆఫీసర్, ఇద్దరు లోడింగ్ ఫైర్‌మెన్లు, ముగ్గురు డ్రైవర్లు, పది మంది ఫైర్‌మెన్లు వుండాలి. మొత్తం 12 స్టేషన్లకు 192 మంది సిబ్బంది వుండాల్సి వుండగా ప్రస్తుతం 132 మంది మాత్రమే వున్నారు. ఈ పరిస్థితుల్లో అగ్ని ప్రమాదం జరిగినపుడు సిబ్బంది కొరత, సుదూర ప్రాంతాల కారణంగా సకాలంలో చేరుకోలేక ప్రమాదాలను నివారించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గిట్టుబాటు ధరేది?



ఇటీవల కురిసిన అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని రోడ్డుపై ఎండబెడుతున్న దృశ్యం.

రుగాలం శ్రమించి పండించిన పంటకు మద్దతు ధర లభించక పోవడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతోంది. రైతులకు ప్రభుత్వం మద్దతు లభించక పోవడంతో దళారులు బలపడిపోతున్నారు. విధిలేని పరిస్థితుల్లో దళారులు చెప్పిన ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి రైతులకు ఏర్పడింది. ప్రభుత్వం మద్దతు ధర క్వింటాలుకు 1030 రూపాయలుగా ప్రకటించగా, షుమారు 200 రూపాయల తక్కువకు మిల్లర్లు, దళారులు కొనుగోలు చేస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లాలో జిలకర మసూరి, బిపిటి 3204, బుడ్డలు సిఆర్ 1009, నెల్లూరు జిలకర మసూరి 34449, స్వాతి 30491, లావులు 43242, ఎంటియు 1010, ఎటియు 1001, టి 145 రకాల ధాన్యాన్ని పండిస్తారు. ఈ ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసినా వాటి వలన ప్రయోజనం లేకుండా పోయింది. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటుచేసిన 34 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గత మూడు మాసాల్లో కేవలం వెయ్యి టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయగలిగారు. కేంద్రాల్లో సిబ్బంది విధిస్తున్న షరతులు తట్టుకోలేక మిల్లర్లు, వ్యాపారులు అడిగిన రేటుకు తెగనమ్ముతున్నారు. దీంతో దాదాపు 30 శాతం మేర ధరలు పతనం అయ్యాయి. షుమారు 200 కోట్ల మేర రైతులు నష్టపోయారు. ప్రభుత్వమే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, దళారి వ్యవస్థను రద్దు చేయాలని వివిధ పార్టీలు, రైతు నాయకులు కోరుతున్నా ఫలితం లేకుండా పోతుంది.

పెంచలరెడ్డి దురాక్రమణల జోలికి వెళ్లని కలెక్టర్, జెసి!

జిల్లాలోని అక్రమ లేఅవుట్లపై జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ యుద్ధం ప్రకటించారు. కాని నెల్లూరు నగరంలో వెయ్యి కోట్ల పైగా విలువ చేసే మునిసిపల్ స్థలాలు, పార్కులు, రిజర్వుడు ప్రాంతాలు ఆక్రమించినా, ఆక్రమిస్తున్నా వారికి జోలికి మాత్రం వెళ్లడం లేదు.



చంద్రమౌళినగర్‌లో పెంచలరెడ్డి ఆక్రమించ యత్నించిన స్థలం.



పెంచలరెడ్డి బాలయోగీశ్వరాశ్రమ స్థలంలో నాటించిన కరెంట్ స్థంబాలు.

నెల్లూరు దక్షిణ శివారులోని చంద్రమౌళి నగర్ ఆరవ వీధిలో పదికోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించడానికి కొందరు రాజకీయ రౌడీలు చేసిన ప్రయత్నాన్ని స్థానికులు అడ్డుకొన్నారు. 8తేది మధ్యాహ్నం వరకు ఆ వీధిలో వాతావరణం వీధి పోరాటం వలె కన్పించింది. నిప్పో ఫ్యాక్టరీకి ఎదురుగా వున్న ఈ ప్రాంతంలో, ఇళ్ల స్థలాల ఖరీదు ఆకాశానికంటుతున్నది. అంకణం లక్ష నుంచి రెండు లక్షల వరకు పలుకుతున్నది. దానితో ఇక్కడ ఖాళీగా వున్న ఒక చెరువు మీద స్థానిక కాంగ్రెస్‌వాదుల కళ్లు పడ్డాయి. దాదాపు ఎకరా స్థలం అది. దాని విలువ ఏ పది కోట్లో వుంటుంది. దాన్ని ఆక్రమించుకోవడానికి స్థానిక కార్పొరేటర్ సన్నపురెడ్డి పెంచల రెడ్డి చాలాకాలం నుంచి ప్రయత్నం చేస్తున్నాడు.

తన ఒక్కడి వల్ల అయ్యే పని కాదని గ్రహించి, ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డిని రంగంలోకి దింపాడు. వివేకా ప్రస్తుత తీరేమిటో నెల్లూరు ప్రజలందరికీ తెలుసు. సిగ్గు లజ్జ రోషం మానం అభిమానం

కొరవ 14వ పేజీలో

జర్నలిజం వ్యవస్థ కట్టు తప్పిపోతోంది!

● **గోపి సంతాపసభలో వెంకయ్యనాయుడు ఆవేదన**



జమీన్‌రైతు పత్రికలో గతంలో సహాయ సంపాదకుడిగా పని చేసిన సీనియర్ జర్నలిస్టు పెన్నేపల్లి గోపాలకృష్ణ సంతాప సభ 8తేది సాయంత్రం టౌన్‌హాల్ పఠనాలయంలో గంభీరంగా జరిగింది. బిజెపి జాతీయ పూర్వాధ్యక్షుడు ముప్పవరపు వెంకయ్య నాయుడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా, వర్తమాన పాత్రికేయ పోకడలను నిశితంగా విశ్లేషించారాయన. నీతి, నిర్భీతి, నిస్పక్షపాతం అనే మూడు సూత్రాల ప్రాతిపదికగా మనుగడ సాగించవలసిన జర్నలిజం వ్యవస్థ కట్టుతప్పి పోతున్నదని, వార్తలలో విశ్వసనీయత లోపిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారాయన. జమీన్‌రైతు పత్రికతో తనకు రాజకీయ విధానాల రీత్యా విభేదాలున్నా, సాన్నిహిత్యం కొన సాగుతూనే వున్నదని; గోపి, బంగోరే వంటి జర్నలిస్టులు అందులో పని చేయడం వల్ల దానికి నిండు రూపం వచ్చిందని వ్యాఖ్యానించారు. సర్వోదయ కాలేజి మాజీ ప్రిన్సిపల్ కాళిదాసు పురుషోత్తం గోపి చేసిన సాహిత్య సేవను ప్రస్తుతించారు. మధురవాణి పాత్ర పైన, ఆఫ్రికాకు వందలేళ్ల క్రితం వలస వెళ్లిన భారతీయుల జీవితాల పైన గోపి వ్రాసిన పరిశోధనాత్మక పుస్తకాలు తెలుగు సాహిత్యంలో చిరకాలం నిలిచి వుంటాయన్నారు. ఉపాధ్యాయుల స్థానం శాసనమండలి సభ్యుడు విరపు బాలసుబ్రహ్మణ్యం గోపి పరిశోధనాశీలతను కొనియాడారు. తెలుగు దేశం జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి జమీన్‌రైతు పత్రికతో తన అనుబంధాన్ని నెమరు వేసుకొన్నాడు. డిసిసి మాజీ అధ్యక్షుడు సివి.శేషారెడ్డి గోపి గారి రచనా నైపుణ్యాన్ని పరామర్శించాడు. వైఎస్ఆర్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షుడు కర్నాటి ఆంజనేయరెడ్డి, జమీన్‌రైతు సంపాదకుడు నెల్లూరు డోలేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. గోపి పెద్ద కుమారుడు ప్రశాంత్ తాను తండ్రి నుంచి నేర్చుకొన్న పాఠాలను విడమరచి చెప్తే, మరొక కుమారుడు ప్రదీప్ తన తండ్రి మరణ ఖేదాన్ని కవితా రూపంలో ఆలపించాడు. సీనియర్ న్యాయవాది అనంత రామయ్య సంతాప తీర్మానం ప్రతిపాదించారు. జమీన్‌రైతు ప్రస్తుత సహాయ సంపాదకుడు అల్లూరు రహీం స్వాగత వందనాలు చెల్లించాడు.



● **అపర వాల్మీకి**

ఎం.ఎస్.రెడ్డి ఆత్మకథ ఆవిష్కరణ!

హైదరాబాద్ రవీంద్రభారతిలో నిండుగా జరిగిన సభ

సహజ కవి మల్లెమాల సుందరరామరెడ్డి ఆత్మకథ వ్రాశారు. ఎనభై ఆరేళ్ల అపర వయస్సులో, తీవ్ర అనారోగ్యంతో మంచం నుంచి దిగలేని పరిస్థితులలో కూడా ఆయనలో రచనా జిజ్ఞాస తగ్గకపోవడం ఆశ్చర్యం కల్గించే విషయం. ఇది నా కథ పేరిట వెలువడిన ఈ ఆత్మకథలో అణుమాత్రం ఆత్మవంచన లేకపోవడం అభినందనీయం. తన జీవిత మూలాలు, ఆరంభ దశలో తాననుభవించిన కష్టాలు, కన్నీళ్లు, అవమానాలు, చీత్కారాలు వంటివాటన్నిటినీ అక్షరం పొల్లు బోకుండా వ్యక్తం చేశారు ఎంఎస్.రెడ్డి గారు. అంత నిజాయితీతో, నిర్మలత్వంతో తమ జీవితాలను నెమరు వేసుకొనే వారు చాలా అరుదు.

ఆత్మకథ వ్రాయాలంటే, దాన్ని వ్రాసేవారి జీవితం సమాజాన్ని ఏదో ఒక రీతిలో ప్రభావితం చేసి వుండాలి. వారి అడుగుజాడల ఒడుపు ముందుతరం వారు నేర్చుకోవాల్సిన అవసరం కలగాలి. తమ కోసం తాము కాక సమాజం కోసం ఎంతో కొంత బ్రతుకును కేటాయించిన వారై వుండాలి. ఈ కోణంలో చూసినప్పుడు ఎంఎస్.రెడ్డికి అర్హతలన్నీ వున్నాయి. ఆయన జీవన ఆరంభం అత్యంత అనామకమైనది. పూట గడవడమే కష్టమైన రైతు కుటుంబ నేపథ్యం. నాలుగక్షరాలు చదువుకొనే అవకాశం లేని పేదరికం. సహాయం కోసం చేతులు చాచి ఆర్థిస్తే దొరికినవి చీత్కారాలు, అవమానాలు మాత్రమే. అంతటి కఠినమైన బాల్యాన్ని ఎదుర్కొన్న ఎంఎస్.రెడ్డికి ఈరోజు సమాజంలో వున్న స్థానం ఏమిటో అందరికీ తెలుసు. అపర వాల్మీకి అవతారమెత్తి రామాయణాన్ని అచ్చ తెలుగు పదాలతో, అద్భుతమైన పద్యాలతో ఆంధ్రీకరించారాయన. ఇప్పటి తరానికి రామాయణ కథను కళ్లకు కట్టే రీతిలో బాలరామాయణం సినిమా నిర్మించారు. జాతీయస్థాయిలో స్వర్ణకమలం వంటి అవార్డులు సాధించడమే కాక, ప్రపంచంలోని పలు భాషాలలోకి అనువదింపబడింది ఆ చిత్రరాజం. తెలుగు సాహిత్యలోకం నివ్వెరపోయే రీతిలో పదుల సంఖ్యలో పుస్తకాలు వ్రాశారు. ఆయన నోటి వెంట ధారాపాతంగా, గంగా ప్రవాహం వలె వెలువడే పద్యాలు, పాఠాలు విన్న వారికి ఆయనెంత గొప్ప పండితుడో అన్న ఆశ్చర్యం కల్గుతుంది. ఆ పాండిత్యం ఆయనకు దేముడిచ్చిన వరం. పూర్వజన్మ సుకృతం. కష్టించి పని చేస్తే, చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే, అంకిత భావంతో కృషి చేస్తే అట్టడుగు బడుగుజీవి కూడా అత్యున్నత స్థానాలు అధిరోహించగలడని తన జీవిత ప్రస్థానంతో రుజువు చేసిన మహిమాన్వితుడు ఎంఎస్.రెడ్డి. ఆయన జీవితం భావి తరాలకు తప్పకుండా ఆదర్శప్రాయం. అందువల్లనే ఆయన ఆత్మకథ రచనకు అన్ని విధాల అర్హుడని చెప్పగలరు ఎవరైనా.

7తేది సాయంత్రం రవీంద్రభారతిలో ఎం.ఎస్.రెడ్డి గారి ఆత్మ కథను ఆవిష్కరించిన మాజీ ముఖ్యమంత్రి రోశయ్య ఆయన్ను అపర వాల్మీకి అవతారంగా అభివర్ణించడం అందువల్లనే. డాక్టర్ సి.నారాయణరెడ్డి, అక్కినేని నాగేశ్వరరావు, ఉండేల మాలకొండారెడ్డి, ప్రగతి ప్రింటర్స్ హనుమంతరావు, ముదిగొండ శివప్రసాద్ వంటి వుద్దండులందరూ పాల్గొన్న ఈ ఆవిష్కరణ సభ ఎంఎస్.రెడ్డి గారి జీవితం వలె నిండుగా కన్పించింది.

ప్రకటన

నెల్లూరు చిన్నబజారులోని శ్రీ జిజియన్ గోల్డ్ అను సంస్థలో (రిజిష్టర్ నెం. 285 of 2008) శ్రీ గులాబ్‌చంద్ గారు, శ్రీ శంకర్‌లాల్ గారు, శ్రీ సోహన్‌రాజ్ గారు, శ్రీ నరేంద్ర కుమార్ గారు పార్ట్‌నర్స్‌గా కలిసి వున్నాము. శ్రీ గులాబ్ చంద్ గారు వయస్సు మీద పడుట వల్ల తేది 31-3-2011 రిటైర్‌మెంట్ తీసుకొని మా సంస్థ నుంచి బయటకు వెళ్లిపోయినారు. కావున ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమేమనగా శ్రీ గులాబ్‌చంద్ గారికి శ్రీ జిజియన్ గోల్డ్ సంస్థతో 31-3-2011 నుంచి ఎటువంటి సంబంధం లేదు. వారితో జరిపే ఎటువంటి ఆర్థిక లావాదేవీలతో మా సంస్థకు గానీ, మాకు గానీ ఎటువంటి సంబంధం లేదని పత్రికా ముఖంగా తెలియజేయడమైనది.

ఇట్లు - **శంకర్‌లాల్, సోహన్‌రాజ్, నరేంద్రకుమార్**

శ్రీ జిజియన్ గోల్డ్

12/1100, చిన్నబజారు, నెల్లూరు. ఫోన్ : 0861 - 2321147



శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాగా ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఆర్యవైశ్య నాయకులు కెవి.చలమయ్య, తిరువీధి ప్రకాశరావు, వెలుగొండ రాయుడు.



ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మండలాధికారులతో సెట్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్‌రెడ్డి.



నెల్లూరు చిల్డ్రన్స్ పార్కులో పరిస్థితులు మెరుగుపర్చాలంటూ డిఆర్వో రామిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బిజెపి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు జి.జీవరత్నం, కార్యదర్శి కోటేశ్వరమ్మ తదితరులు.



బుచ్చిరెడ్డిపాళెంలో పేద ముస్లిం పిల్లలకు ఒడుగుల కార్యక్రమం అనంతరం పౌష్టికాహారం అందజేస్తున్న అల్లాబక్షు, షాహుల్, యజ్దానిబాషా.

రూ.170కోట్ల పంట రుణాలు!

ఎన్‌డిసిసి బ్యాంక్ జిఎం హామీ

ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు 170కోట్ల రూపాయల పంట రుణాలను అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎన్‌డిసిసి బ్యాంక్ జనరల్ మేనేజర్ మదన్‌మోహన్ తెలిపారు. నాయుడుపేట కోఆపరేటివ్ బ్యాంకులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ బ్యాంకు ద్వారా రైతులకు మరిన్ని సేవలు అందించేందుకు చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు. దీర్ఘకాలిక రుణాలకు సంబంధించి 25కోట్ల రుణాలు అందించనున్నట్లు చెప్పారు. 2009–10 సంవత్సరానికి 130కోట్ల పంట రుణాలను అందించగా వాటిలో 94శాతం రికవరీ అయ్యాయన్నారు. గతంలో రైతులకు 50వేలకు మించి రుణాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఈ ఏడాది నుంచి వాయిదాలు సక్రమంగా చెల్లిస్తున్న రైతులను గుర్తించి వారికి 75వేల నుంచి లక్ష రూపాయల వరకు రుణం అందిస్తామన్నారు. జిల్లాలోని సహకార సంఘాలు రైతులకు ఇచ్చిన రుణాల్లో 65శాతం రికవరీ సాధించాలని, వాటిని సాధించలేని సంఘాలకు భవిష్యత్తులో రుణాలు అందించమని స్పష్టం చేశారు. ఈ ఏడాది నుంచి కొన్ని సహకార సంఘాల్లో ఎరువులతోపాటు పురుగు మందుల విక్రయాలు జరిగేలా చూస్తామన్నారు.

తిరగబడ్డ రైతులు

ధాన్యానికి మద్దతు ధర కల్పించకుండా చైతన్యయాత్రలు చేపట్టడంపై వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నేతలు అధికారులపై తిరగబడిన ఘటన దక్కిలి మండలంలో చోటు చేసుకొంది. మండలంలోని మాటుమడుగు, శ్రీపురం గ్రామాల్లో అధికారులు రైతుచైతన్య యాత్రలు చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు వారు వచ్చిన వెంటనే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు అడ్డుకొన్నారు. రైతులు ఆరుగాలం పండించిన పంటలకు మద్దతు ధర లభించటం లేదని, దళారులు చెప్పిన ధరలకే ధాన్యాన్ని తెగనమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇంత జరుగుతున్నా దళారులకే ప్రభుత్వం కొమ్ముకాస్తోందని, రైతులకు మొండిచేయి చూపుతోందని నేతలు అధికారులతో వాగ్వివాదానికి దిగారు. ఒక దశలో అదుపు తప్పిన నేతలు రైతు చైతన్య యాత్రల వాహనాలకు కట్టిన బ్యానర్లు, మైకులను తొలగించి వేశారు. ఈ నిరసన కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు రవీంద్రరెడ్డి, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దక్కిలిలో ఇబ్బందిపడ్డ అధికారులు

పార్టీల్లో సందడి

ప్రచారంలో కావలి నేతలు

మునిసిపల్ ఎన్నికలు ఎప్పుడు జరిగేది స్పష్టమైన ప్రకటన వెలువడకపోయినా రాజకీయ పార్టీల్లో మాత్రం సందడి మొదలైంది. కావలిలో వివిధ పార్టీల నేతలు అప్పుడే కసరత్తు ప్రారంభించారు. కాంగ్రెస్, తెలుగుదేశం, బిజెపి, వామపక్ష పార్టీలతోపాటు క్రొత్తగా ఏర్పాటైన వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నేతలు ఓటర్ల జాబితా చేత బట్టి వార్డుల్లోకి వెళుతున్నారు. పట్టణంలోని 37 వార్డులకు వెళ్లిన ఆయా పార్టీల నేతలతో ఎన్నికల వాతావరణం ఏర్పడింది. తప్పొప్పులు చూసుకొంటూ, మార్పులు చేర్పులు చేపడుతూ ప్రజలను కలసుకొని ప్రసన్నం చేసుకొనేందుకు నానా తిప్పలు పడుతున్నారు నేతలు. వీరిలో కాంగ్రెస్, బిజెపి నాయకులు ఓటర్లను కలసుకొనే విషయంలో ముందంజలో వుండగా ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీతోపాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలు మల్లగుల్లాలు పడుతున్నాయి. మొత్తం మీద కావలి పట్టణంలో మునిసిపల్ ఎన్నికల హడావిడి మొదలైందనే చెప్పాలి.

● తప్పుల తడికలుగా

ఓటర్ల జాబితాలు!

అల్లూరులో పరిస్థితిది.

అధికారులు ఓటర్ల జాబితా సవరణలపై ఎన్ని కసరత్తులు చేసినా ఏమాత్రం ప్రయోజనం వుండడం లేదు. జాబితాలో తప్పులు దొర్లుతూనే వున్నాయి. ఇందుకు ఉదాహరణ అల్లూరు మండలం. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ప్రచురించిన ఓటర్ల జాబితాలు తప్పులతడకగా వున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికలకు, నేటికి పరిశీలిస్తే షుమారు 6వేల ఓట్లు తొలగించారట. అల్లూరు పంచాయితీలో గత ఎన్నికల్లో 16,200 ఓట్లు వుండగా ప్రస్తుతం ప్రచురించిన జాబితాలో 12,620ఓట్లుగా తేలాయి. వున్న వారి పేర్లను తొలగించిన సిబ్బంది, మరణించిన వారి పేర్లు మాత్రం అలాగే వుంచారట. పెద్ద ఎత్తున ఓటర్ల జాబితాలో తప్పులు వుండడంతో ఓటర్లు ఆందోళన చెందుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇంకా జాబితా సక్రమంగా విడుదల చేయకపోవడంపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నిధుల దుర్వినియోగంపై నిరసన!

ముత్తుకూరు పంచాయితీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ ఉపసర్పంచ్ సుంకర శ్రీనివాసులు ఆధ్వర్యంలో పంచాయితీ కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయితీలో గత నాలుగేళ్లుగా అభివృద్ధి కుంటు పడిందన్నారు. పంచాయితీ జనరల్ ఫండ్ ఎంత వచ్చింది, ఎంత ఖర్చు చేసింది వార్డు సభ్యులకు తెలియదని, ఇష్టానుసారంగా నిధులు ఖర్చు చేసినట్లు చూపి సర్పంచ్, కార్యదర్శి దిగమింగారని

పంచాయితీ కార్యాలయం వద్ద ధర్నా


వారు ఆరోపించారు. మండలంలో పరిశ్రమల నుంచి పెద్ద మొత్తంలో అభివృద్ధి పేరుతో నిధులు తీసుకొని వాటిని స్వాహా చేశారన్నారు. మొత్తం మీద పంచాయితీలో ఐదు కోట్ల రూపాయల మేర నిధులు దుర్వినియోగం అయినట్లు వారు ఆరోపించారు. ప్రభుత్వం దీనిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేసిన సభ్యులు కార్యాలయానికి తాళాలు వేశారు. ఉపసర్పంచ్‌తోపాటు వార్డు సభ్యులు విజయ్, సుబ్రహ్మణ్యం, లింగయ్య, పెంచలయ్య, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.



అపోలో డెంటల్ హాస్పిటల్ మాజీ మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ ఎర్రంరెడ్డి ప్రసాద్‌రెడ్డి ద్వితీయ వర్థంతి సందర్భంగా నెల్లూరు బృందావనంలో అన్నదానం చేస్తున్న ప్రసాద్‌రెడ్డి కుమారుడు అన్వేష్, డాక్టర్ కొండారెడ్డి.

అధికారంలోకి వచ్చేది జగనే!

రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి వెల్లడి



రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా వచ్చేది వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని ఆపార్టీ నేత రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి జోస్యం చెప్పారు. కావలి రూరల్ మండలం సర్వాయపాళెం పంచాయితీలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు వైఎస్ జగన్ నాయకత్వం కావాలని కోరుకొంటున్నారని తెలిపారు. ఇందుకు కడప, పులివెందుల నియోజకవర్గాల్లో జరిగిన ఉప ఎన్నికలే నిదర్శనం అన్నారు. వైఎస్ఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. పేదలు, రైతులకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలు అమలు చేసే సత్తా జగన్‌కు మాత్రమే వుందన్నారు. సర్వాయపాళెం పంచాయితీకి చెందిన టిడిపి బిసిసెల్ ప్రచార కార్యదర్శి సూరగాని బ్రహ్మయ్య, తెలుగు యువత అధ్యక్షుడు పి.శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడు భరత్‌కుమార్, కోటేశ్వరరావు, శ్రీనివాసులు, కేతిరెడ్డి వెంకటరమణారెడ్డి, కాంగ్రెస్ పార్టీకి చెందిన మల్లీశ్వరీ తదితరులు షుమారు 500 మందికిపైగా కార్యకర్తలు ప్రతాప్‌కుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఈ సమావేశంలో కావలి మాజీ మున్సిపల్ ఛైర్మన్ నగళ్ల శ్రీనివాస కిరణ్, జడ్పీటీసీ సభ్యులు శ్రీనివాసులు, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

లాభాల బాటన రొయ్యల సాగు!

దశాబ్దకాలంగా రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చిన రొయ్యల సాగు తిరిగి లాభాలు ఆర్జిస్తుంది. సముద్రతీర ప్రాంతాల్లో తిరిగి మునుపటి మాదిరిగా అధికంగా రొయ్యల సాగు చేపట్టారు. రొయ్యల రైతులకు ఆశలు కల్పిస్తూ టైగర్ సాగుతోపాటు వెనామి మంచి ఫలితాలను అందిస్తుండడంతో జిల్లావ్యాప్తంగా 50వేల ఎకరాలకుపైగా రొయ్యల సాగు చేస్తున్నారు. పూర్వ వైభవం వస్తున్న తరుణంలో రొయ్యల రైతాంగానికి విద్యుత్‌కోత కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. మిగిలిన రొయ్యల సాగుతో పోల్చితే వెనామి, టైగర్ రొయ్యల పెంపకానికి అధికవ్యయం, ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సి వుంటుంది. ఈ

వేధిస్తున్న విద్యుత్ సమస్య

పరిస్థితుల్లో విద్యుత్ కోతలు రైతులకు దడపుట్టిస్తున్నాయి. 24 గంటలు విద్యుత్ అవసరమైనా ఏడు గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా జరుగుతోంది. అందులోనూ సక్రమంగా సరఫరా వుండకుండా ఎడాపెడా కోత విధిస్తుండడంతో రొయ్యల రైతులు లబోదిబోమంటున్నారు. తీరప్రాంతాల్లోని ఇసుకనేలల్లో అధికంగా సాగవుతున్న రొయ్యల సాగుకు 24 గంటలు మోటార్లు ఆడితేనే గుంటల్లోని నీళ్లలో ఆక్సిజన్ వుంటుంది. చాలీచాలని ఏడుగంటల విద్యుత్‌తో వెనామి విలవిలలాడుతోంది. తగినంత నీటిని అందించలేకపోతుండడంతో రొయ్యలు మరణిస్తున్నాయని రైతులు లబోదిబోమంటున్నారు. తప్పని పరిస్థితుల్లో డీజిల్ ఇంజన్లను వాడుతున్నందున ఆర్థిక భారం పడుతోందని రైతులు వాపోతున్నారు.

రైతులను పట్టించుకోని ప్రభుత్వం!



ప్రసన్న విమర్శ

రైతు ప్రభుత్వమని చెప్పుకొనే కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల గురించి పట్టించుకోవడం లేదని కోవూరు శాసన సభ్యుడు నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి విమర్శించారు. ఇందుకూరుపేట తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన ఆయాల ఇంటర్వ్యూ కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన రాష్ట్రప్రభుత్వం తీరుపై విమర్శలు గుప్పించారు. ధాన్యం ధర పతనానికి మిల్లర్లు, దళారులే కారణమని అలాంటి వారి గురించి తెలిసినా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన చెందారు. తగిన విధంగా వ్యవహరించి రైతులకు న్యాయం చేయాల్సిన ముఖ్య మంత్రి, మంత్రులు ఆ విషయాన్ని ప్రక్కనపెట్టి సోనియాగాంధీకి వినతిపత్రం ఇవ్వడం ఏమిటని ఆయన ఎద్దేవా చేశారు.

● బోగోలులో

చోటానేతల హల్‌చల్

బోగోలు మండల కేంద్రంలో చోటానేతల తాకిడి అధికంగా వుంది. ఖద్దరు దుస్తులు ధరించి కార్లలో మండల తహశీల్దార్ కార్యాలయానికి వచ్చే వారి సంఖ్య అధికమవుతోంది. వీరిలో అధిక సంఖ్యాకులు నెల్లూరు నగరానికి చెందిన మాజీ కార్పొరేటర్లు కావడం విశేషం. మండలంలో పోరంబోకు భూముల వివరాలు తెలుసుకొని అమ్మకాలు సాగించేందుకు రెవెన్యూ అధికారులు,

పోరంబోకు భూములపై కన్ను

సిబ్బందితో కుమ్మక్కై ఈ తంతు సాగిస్తున్నట్లు సమాచారం. గతంలో ఇక్కడ ఎమ్మార్వోగా పని చేసిన మహిళ కొన్ని స్థలాలను అమ్మినట్లు గగ్గోలురేగింది. స్థానికులు తిరగబడి దానిని అడ్డుకొన్నారు. తిరిగి మళ్లీ ఈ కార్యకలాపాలను సాగించేందుకు చోటానేతలు తహశీల్దార్ కార్యాలయంలోనే తిష్టవేసి వుంటున్నారు. కార్యాలయంలో అధికారుల వద్ద కూర్చొని గంటల తరబడి సమాలోచనలు చేస్తుండడంతో వివిధ సమస్యలపై కార్యాలయానికి వచ్చేవారు అర్జీలు ఇచ్చేందుకు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది.

కొండాపురంలో శునక రాజ్యం!

కొండాపురం మండలంలో కుక్కల సంచారం ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో పిచ్చికుక్కలు కరచి రేబిస్‌వ్యాధి బారినపడి మృత్యువాత పడుతుండడంతో ప్రజల్లో భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. మండల పరిధిలోని గానుగపెంట, పెరికిపాళెం గ్రామాల్లో ఏరియా వైద్యశాలలో టిటి ఇంజక్షన్ వేసిన వైద్యులు యాంటి రేబిస్ ఇంజక్షన్ వేసేందుకు నిరాకరించారు. సీసాలో వున్న మందు ముగ్గురికి వేయాలని, ఇప్పుడు ఒక్కరే వచ్చినందున ఇంజక్షన్ వేయలేమంటూ నిర్లక్ష్యంగా జవాబు చెప్పడంతో ఎంతగా వేడుకున్నా ఫలితం లేకుండాపోయింది. చివరకు చేసేదిలేక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాల్సి వచ్చింది.

కుక్కలు కరిచినా దిక్కులేదు

కుక్కలబారిన పడి పలువురు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. పెరికిపాళెంలో హరిత అనే ఎనిమిదేళ్ల బాలికను పిచ్చికుక్క కరచింది. 108 వాహనానికి సమాచారం అందించినా గ్రామానికి వచ్చే రోడ్డు బాగాలేదని, కొమ్మి వరకు వస్తామన్నారు. గ్రామస్తులు గాయాలపాలై రక్తం కారుతున్న బాలికను అలాగే మోటర్‌సైకిల్‌పై తీసుకవచ్చారు. కావలి, బోగోలు, అల్లూరు, దగదర్తి మండలాల్లోనూ కుక్కల బారిన పడేవారి సంఖ్య రోజురోజుకు అధికమవుతోంది. ప్రజల ప్రాణాలను బలి తీసుకుంటున్న కుక్కల్ని పట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోకపోవడం, వైద్య సిబ్బంది నిర్లక్ష్యం ప్రజలకు ప్రాణాంతకంగా మారింది. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సి వుంది.

ప్రథమవర్ధంతి



మా ఇంటి జ్యోతి, నిరంతరం మా మదిలో
వెలిగే ధృవతార, మా అభివృద్ధికి కారకులు
అనురాగంతో మమ్మల్ని తన గుండెల్లో దాచుకొన్న
ప్రేమమయి శ్రీమతి రామావర్ధుల విశాలాక్షి గారు
స్వర్గస్తులై తేది 12-06-2011కి సంవత్సరం
పూర్తవుతుంది. ప్రథమవర్ధతి సందర్భంగా
వారిని స్మరించుకొంటూ...

భర్త : రామావర్ధుల శ్రీశైలం

కుమారులు
రామావర్ధుల కొండమురళీ మోహన్
రామావర్ధుల సాయికృష్ణమోహన్


కుమార్తె - అల్లుడు
గుండు సాయిమాధురి - గుండు బాలాజి
మనుమరాలు : నేహాశర్మ

కీ॥శే॥ రామావర్ధుల విశాలాక్షి
జననం 11-11-1946 | రిట్టైర్డు సబ్ యూనిట్ ఆఫీసరు జిల్లా మలేరియా ఆఫీసు, నెల్లూరు. | మరణం 12-06-2010


జనంలో కిరణ్!



సిఎం కిరణ్‌కు ఎవరు సలహా ఇచ్చారోకానీ జనంలోకి వెళ్తున్నాడు. రైతు చైతన్య యాత్రలు, రైతు సదస్సుల పేరుతో కిరణ్ బిజీగా వున్నాడు. పనిలో పనిగా హైదరాబాదు నగరంలోని మురికివాడల్లో, చుట్టుప్రక్కల వున్న హరిజనవాడల్లో సమావేశాల్ని పెట్టి జనానికి చేరువకావాలనుకుంటున్నాడు. పార్టీలో అనుచరగణం లేకపోవడం కిరణ్‌కు మైనస్‌గా మారింది. కనీసం మంత్రుల దగ్గర నుంచైనా మద్దతు లభిస్తోందా! అంటే అదీ లేదు. వైఎస్‌లాగా జనంలోకిపోయి జననాయకుడైతే ఇక తనకు ఎటువంటి ధోకా వుండదని కిరణ్ భావిస్తున్నాడు. అనుకున్నదే తడవుగా తన వ్యూహాన్ని ఆచరణలో పెడ్తున్నాడు. అయితే కిరణ్ ఆశించినట్లుగా జనస్పందన లభించడం లేదు. తెలంగాణ ప్రాంతంలో పర్యటించినప్పుడు నిరసనల హోరు కిరణ్‌ను ఇబ్బంది పెడ్తోంది. ఇక సొంతజిల్లా పార్టీ పోరు కిరణ్‌కు నిద్రలేని రాత్రుల్ని మిగులుస్తున్నాయట. మరో పది రోజుల్లో డిప్యూటీ సిఎం నియామకంతోపాటు మంత్రివర్గ ప్రక్షాళన జరగబోతోంది. ఈ మార్పులన్నీ కిరణ్‌కు 'చెక్' పెట్టడానికేనన్నది సుస్పష్టం. ఇప్పటికే పిసిసి చీఫ్‌గా తన 'శత్రువు'ను నియమించడాన్ని కిరణ్ జీర్ణించుకోలేకపోతున్నాడు. అటు పార్టీలో ఇటు ప్రభుత్వంలో తలనొప్పుల్ని తట్టుకొని నిలబడటం కిరణ్‌కు అగ్నిపరీక్షగా మారింది. పాపం కిరణ్.



కిరణ్ మెడపై 'సత్తి' కత్తి




పిసిసి చీఫ్ సత్తిబాబు రూపంలో సిఎం కిరణ్ మెడపై కత్తి వేలాడుతోందా! నిజమే అంటున్నాయి కాంగ్రెస్ వర్గాలు. కిరణ్ సిఎం అయిన దగ్గరనుంచీ బొత్సా సత్తిబాబుతో ఉప్పు – నిప్పులా వుంటున్నాడు. సిఎం పదవిని ఆశించి భంగపడ్డ బొత్సాకు ప్రాధాన్యం లేని రవాణాశాఖనిచ్చి కసి తీర్చుకున్నాడు కిరణ్. అప్పటి నుంచి బొత్సా కూడా కిరణ్‌పై కత్తులు నూరుతున్నాడు. ఇటీవలి కడప ఉప ఎన్నికల సందర్భంగా కూడా సిఎం కిరణ్ సరిగా వ్యవహరించలేదంటూ సన్నాయి నొక్కులు నొక్కాడు. పిసిసి చీఫ్‌గా బొత్సా పేరు తెరపైకి వస్తున్న సందర్భంలో కిరణ్ కాస్తంత గట్టిగానే వ్యతిరేకించాడు. బొత్సా సామాజిక వర్గానికి చెందిన కన్నా లక్ష్మీనారాయణ పేరును కిరణ్ సిఫార్సు చేశాడు. దీంతో కిరణ్‌పై బొత్సా అగ్గిమీద గుగ్గిలమయ్యాడు. అవకాశం దొరికినప్పుడల్లా కిరణ్‌కు వ్యతిరేకంగా ప్రచారం మొదలుపెట్టాడు. తన సామాజిక వర్గానికి చెందిన చిరంజీవిని ప్రయోగించి ఢిల్లీ పెద్దల దగ్గర మార్కులు కొట్టేశాడు. దీంతో కిరణ్‌కు ఏమాత్రం ఇష్టం లేకపోయినా బొత్సాను పిసిసి వరించింది. రాష్ట్ర సిఎంగా గత ఆర్నెల్లుగా కిరణ్ ఏమాత్రం ప్రభావం చూపలేకపోయినా పిసిసి చీఫ్‌గా బొత్సా పార్టీని ఒక కొలిక్కి తెస్తాడని ఢిల్లీ పెద్దలు బాగా ఆశలు పెట్టుకొంటున్నారు. దీంతో బొత్సాకు 'ఫ్రీ' హ్యాండ్ లభించినట్లే అన్నది కాంగ్రెస్ వర్గాల ఉవాచ. రేపు కిరణ్ విషయంలో అధిష్టానానికి కోపం వస్తే కాబోయే సిఎంగా బొత్సాకు నూటికి నూరుశాతం అవకాశాలున్నాయన్నది రాజధాని టాక్!!



బాబా రామ్‌దేవ్ అరెస్ట్‌కు నిరసనగా గాంధీబొమ్మ వద్ద సోనియాగాంధీ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బిజెపి కార్యకర్తలు.

కాంగ్రెస్‌లో 'చిరు' గాలి



ప్రస్తుతం కాంగ్రెస్‌లో 'చిరు'గాలి వీస్తోందా! అంటే అవుననే అంటున్నాయి కాంగ్రెస్ వర్గాలు. ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసిన దగ్గర నుంచి చిరంజీవి పట్ల ఢిల్లీ పెద్దలు ప్రత్యేక ప్రేమను చూపిస్తున్నారు. అసెంబ్లీలో స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నికలో 'చిరు' మద్దతును మరచిపోలేక పోతున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల పరిశీలకుడు గులామ్ నబీ ఆజాద్ కూడా 'చిరు' అవసరాన్ని భూతద్దంలో చూపిస్తున్నాడట. దీంతో రాష్ట్ర కాంగ్రెస్‌లో తీసుకోబోయే కీలక నిర్ణయాల్లో సైతం 'చిరు' అభిప్రాయాన్ని తెలుసుకుంటున్నారు. పిసిసి చీఫ్ నియామకంలో ప్రధానంగా 'చిరు' చెప్పిన బొత్సాకే అవకాశం లభించింది. అలాగే త్వరలో ఏర్పాటుకానున్న పిసిసి కార్యవర్గ ఏర్పాటులో కూడా 'చిరు' సిఫార్సులకు పెద్దపీట వేయనున్నట్లు అభిజ్ఞ వర్గాల భోగట్టా. ఢిల్లీ పెద్దల దగ్గర పలుకుబడి పెరగడంతో ఇప్పుడు కాంగ్రెస్‌లో 'చిరు'గాలి కాస్తంత ఎక్కువగానే వీస్తోందని గాంధీభవన్ వర్గాలు చెవులు కొరుక్కొంటున్నాయి.

ఐఏఎస్‌ల ఆట విడుపు



బదలీ ప్రక్రియకు తాత్కాలికంగా తెరపడటంతో ఐఏఎస్‌లకు ఆటవిడుపుగా మారింది. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో ఐఏఎస్‌ల బదలీల్ని తాత్కాలికంగా వాయిదా వేశారు కిరణ్. దీంతో ఐఏఎస్‌లంతా ఊపిరిపీల్చుకున్నారు. మే – జూన్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు జరుగుతున్న సమయంలో తమ బదిలీలు నిలిచిపోవడంతో ఐఏఎస్‌లంతా ఎగిరి గంతేస్తున్నారు. ఉద్యోగుల బదలీల పేరుతో ఐఏఎస్‌ల జేబులు బరువెక్కుతున్నాయి. దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న చందంగా ఐఏఎస్‌లు సిగ్గువిడిచి ఉద్యోగుల దగ్గర నుంచి డబ్బులు పిండుకుంటున్నారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖలో కమిషనర్ ఎఆర్ సుకుమార్ బదిలీల పేర భారీగానే బేరసారాలు కుదుర్చుకుంటున్నాడట. ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, రెవెన్యూశాఖలో ప్రాంతాన్ని బట్టి పోస్టును బట్టి బదిలీలకు వెలకడ్తున్నారు. ఇక అయ్యవార్ల బదిలీల కథకు అంతే లేకుండా వుంది.



అన్నదాతల పండుగ
ఏరువాక పూర్ణిమ

రైతులకు అత్యంత ప్రియమైన పండుగ ఏరువాక పూర్ణిమ. కృషీవలుడు తమకు ఆహారాన్ని ఇచ్చే పంటపొలాల్లోను, తమతోపాటు క్షేత్రంలో శ్రమించే పశువుల్లోను, వ్యవసాయ ఉపకరణాల్లో దైవాన్ని చూస్తారు. అందులోను నేలతల్లి పులకించి ఇచ్చే గింజలు లేకపోతే ప్రపంచమంతా పస్తుండాల్సిందే. అందుకే పంచభూతాల్లోనూ పుడమితల్లికే అగ్రతాంబూలం ఇచ్చారు. తొలిగా వర్షపు చుక్కపడినప్పుడు, ఆరుగాలం తనతో గడిపే రైతు తొలిఅడుగు తనపై వేసినపుడు హర్షాతిశయంతో పరవశిస్తుంది. అలాంటి రైతన్నకు సంబంధించిన పండుగే ఈ ఏరువాక పూర్ణిమ.

ఈ పండుగను ప్రతి సంవత్సరం జ్యేష్ఠ శుద్ధ పూర్ణిమ నాడు ఏరువాక పున్నమిగా జరుపుకొంటారు. ఏరు అంటే నాగలి అని, వాక అంటే పొలాన్ని దున్నడమని అర్థం. ఆ పండుగనాడు రైతులు వ్యవసాయానికి ఉపయోగించే సామాగ్రిని, పశువులను అత్యంత భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. పొలాన్ని దున్నేనాగలికి పసుపు కుంకుమలు అద్ది ఆ నాగలిని తమ భుజాన వేసుకొని నేలతల్లిని నాగళ్లతో దున్నేందుకు సిద్ధపడతారు. ఈ పండుగ నాడు పలు ప్రాంతాల్లో గోగు నారను తాడుగా పేని తోరణంగా వేలాడ దీస్తారు. ఆ తోరణాన్ని చెర్నాకోలతో కొట్టి వచ్చిన పీచును తీసుకొనిపోయి పశువుల కొట్టాలలో భద్రపరచుకొంటారు. అలా చేస్తే మంచి జరుగుతుందని ఒక నమ్మకం. వర్షరుతువు ఆరంభంలో కర్షకులు జరుపుకొనే ఈ పండుగ జనజీవనంలో ఏరువాక పున్నమిగా ప్రాచుర్యంలోకి వచ్చినా, ఇది వైదికోత్సవం కాదు. దీనిని కొందరు కృషి పౌర్ణమిగాను పిలుస్తారు. శ్రీకృష్ణపరమాత్ముడు గోపాలురకు గిరియజ్ఞం, కర్షకులకు ఏరువాక, బ్రాహ్మణులకు మంత్ర జపం యజ్ఞాలుగా పేర్కొన్నట్లు భాగవత పురాణం చెప్తున్నది. విష్ణుపురాణం ఏరువాక పూర్ణిమనే సీతాయజ్ఞంగా పేర్కొంది. శుద్ధోధన మహారాజు కపిలవస్తు నగరంలో వర్ష రుతువు ఆరంభంకాగానే కర్షకులకు లాంఛనంగా ఒక బంగారు నాగలిని అందజేసేవాడని లలితా విస్తరం చెబుతోంది. హాలుని గాథాసప్తశతిలోనూ ఏరువాక పున్నమి ప్రస్తావన వుంది. శ్రీకృష్ణదేవరాయలు కూడా ఏరువాక సందర్భంగా రైతులను అభినందిస్తూ తగిన ప్రోత్సాహకాలు అందించేవారట. ఐరోపా దేశాల్లోని మేపోవ్ ఇలాంటి పండుగే.

యాగాలతో బిజీ...



ఆనం కుటుంబీకులు దైవ కార్యాలలో విధిగా పాల్గొంటారు. వీరి కుటుంబంలో అగ్రజుడు ఆనం వివేకానందరెడ్డి సందర్భానికి తగ్గట్టు వేషమేసి ఇంకాస్త ఆకట్టుకొంటాడు. ఏప్రిల్ నెలలో ఆర్థికమంత్రి ఆనం రామనారాయణరెడ్డి సంతపేటలోని తన ఇంట్లో సకుటుంబ సమేతంగా చండీయాగం చేసి అందరినీ ఆకర్షించారు. రాష్ట్ర ప్రజలు సుఖంగా వుండాలని తానీ యాగాన్ని తలపెట్టినట్లు ఆర్థికమంత్రి గొప్పగా చెప్పకొన్నా సిఎం పదవిని ఆకాంక్షించి దీన్ని చేశారని ముఖ్యమంత్రికి వేగులు సమాచారం అందించడంతో వారి మధ్య ఇప్పుడు ఉప్పు – నిప్పుగా వుంది. తమ్ముని యాగానికి చేయూతనందించనేమో రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి 5తేది రంగడి సన్నిధిలో మహా సుదర్శన యాగానికి శ్రీకారం చుట్టారు. లోక కళ్యాణార్థం ఈ యాగానికి సంకల్పించినట్లు వివేకా చెబుతున్న మాటలు నమ్ముదామా?

భలే గురువులు




సమాజంలో గురువుల స్థానం రోజురోజుకు దిగజారడానికి వారిలో నీతినిజాయితీలు తగ్గిపోయి అవినీతి అక్రమాల బాటన నడవడమే కారణం. డ్యూటీ చేసే సమయం తక్కువ కావడంతో తమకున్న తెలివి తేటలతో నానా అక్రమాలకు పాల్పడుతున్నారు. విద్యాశాఖలో మెడికల్ రీఎంబర్స్‌మెంట్ చెల్లింపులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ శాఖ జరిపిన విచారణలో 10శాతానికి పైగా గురువులు దొంగ బిల్లులు పెట్టి లక్షల రూపాయల ప్రభుత్వ సొమ్ము దోచేసినట్లు తేలింది. ఈ దొంగ బిల్లులను విద్యాశాఖాధికారులు కొంత కమీషన్ తీసుకొని పాస్ చేసిపారేశారు. సమాజానికి మార్గదర్శకులు మరీ ఇలా దిగజారిపోవడం బాధాకరం.

గురివింద...

నెల్లూరు నగరంలో రోడ్లు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల తతంగమంతా రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి కనుసన్నలలో జరుగుతుంది. ఆయనకు తెలియకుండా, కానుక లివ్వకుండా ఏ బిల్డింగ్‌నైనా కడితే అది మరుసటి రోజు కల్లా కార్పొరేషన్ అధికారుల చేతిలో కుప్పకూలిపోతుందని జనానికంతా తెలుసు. కాని 2తేది డైకస్‌రోడ్డులో షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించిన వివేకా నగరంలో ఖాళీస్థలాలు కనపడితే చాలు ఎర్రచొక్కాలోళ్లు, పసుపు చొక్కాలోళ్లు జెండాలు పాతుతున్నారు. ఆ తర్వాత అక్కడో పాఠశాల పెట్టి అకస్మాత్తుగా స్థలాన్ని అమ్మేస్తున్నారని చెప్పుకొచ్చారు. ఒకప్పుడు నగరంలో ఎర్రచొక్కాలోళ్లు దురాక్రమణలు చేసేవారు. ఇప్పుడు ఈ పనిలో ఆనం అనుచరులే బిజీగా వున్నా వివేకానందరెడ్డి తనవాళ్లను వెనకేసుకొచ్చి గురివింద గింజ సామెతను గుర్తుకు తేవడం చర్చనీయాంశమయ్యింది.



ప్రచారంపై చిటపట



జిల్లా కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి పనితీరు భిన్నంగా వుంటుంది. ఆఫీసులో కాస్త సమయం దొరికితే చాలు గ్రామాల పర్యటనకు వెళ్తున్న ఆయనను ఐస్ చేయను మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పెదుతున్న ఫ్లెక్సీలు, కడుతున్న బ్యానర్లు నచ్చినట్లు లేదు. ఈవారం పర్యటనల్లో ఫ్లెక్సీలు కట్టిన అధికారులతో నా పర్యటనలు విధి నిర్వహణలో భాగమే. వీటిని ఆర్భాటం చేయను ఫ్లెక్సీలు, బ్యానర్లు కడితే ఊరుకొనేది లేదని ఖరాఖండిగా చెప్పడంతో రెవిన్యూ అధికారులు మారు మాట్లాడ లేక బిగుసుక పోవడం ట్రంకు రోడ్డులో చర్చనీయాంశమయ్యింది.

దొంగ పోలీసులు



నెల్లూరు పోలీసులు దొంగలుగా మారుతున్న విషయమై ట్రంకురోడ్డులో ప్రతినిత్యం వాడివేడి చర్చలు జరుగుతున్నాయి. ఇటీవల కొందరు క్రైం పోలీసులు బైకులు దొంగతనం చేసిన దొంగలను పట్టుకొని వారి నుంచి బైకులు స్వాధీనం చేసుకొని రికవరీ చూపకుండా సొంతానికి వాడుకొంటున్నారు. ఈ విషయం ప్రక్క జిల్లాలో దొరికిన దొంగ అక్కడి పోలీసులకు సమాచారం చెప్పడంతో బయటపడింది. నెల్లూరు పోలీసుల్లో మానసిక పరివర్తనకు కొత్త ఎస్పీ ఏదైనా చర్యలు తీసుకోకుంటే కంచే చేను మేసినట్లు తయారైపోతారు మన పోలీసులు.



మేషం
అశ్వని, భరణి, కృత్తిక 1 పా

అధిక ఖర్చులు మనసును కుంగతీస్తాయి. బంధువుల రాక తృప్తిని స్తుంది. దైవ కార్యాలలో ఎక్కువగా పాలు పంచుకోవాలి. వ్యాపారులకు లాభాలలో కొంత కోత ఏర్పడవచ్చు. నిదానంగా ఖాతాదారుల మనసెరిగి నడచుకోవడం మంచిది. భాగస్వాములతో గొడవలు రాకుండా చూసుకోవాలి. రాజకీయులు లేనిపోని గొడవల్లో చిక్కుకొంటారు. ఉద్యోగులకు శ్రమ అధికం.



వృషభం
కృత్తిక 2,3,4 పా. రోహిణి, మృగశిర 1,2 పా

తలకు గాయాలు తగిలే అవకాశాలెక్కువ. జాగ్రత్త. ధనవిషయంలో కటకట ఉండవచ్చు. సోదరులతో అభిప్రాయభేదావకాశాలు. పనులు నిదానంగా సాగవచ్చు. ఒకటికి రెండుసార్లు ఆలోచించి చేయడం మంచిది. వ్యాపారులకు గడచిన వారంలో ఏర్పడ్డ నష్టాలను ఈ వారంలో పూడ్చుకో వీలవుతుంది. అప్పులు తీరుస్తారు. విద్యార్థులకు ఒకవిధంగా చదువు సాగుతుంది.



మిథునం
మృగశిర 3,4 పా. ఆర్ద్ర,పునర్వసు,1,2,3 పా

నరాలకు సంబంధించిన బాధలధికం. సంతానమూలంగా మానసిక వేదనకు గురౌతారు. ప్రతి విషయంలో ఎదుటివారు తప్పుగా అంచనా వేస్తారు. కోరినా సలహాలివ్వవద్దు. గుట్టుగా కాలం గడపడం మంచిది. ఆర్థిక విషయాలు అంతంతమాత్రమే. ప్రయాణాలు కోరినరీతిలో జరుగవు. వ్యాపారులు ఖాతాదారులతో జాగ్రత్తగా మెలగాలి. రాజకీయులకు తీరని వేదన చోటుచేసుకొంటుంది.




కర్కాటకం
పునర్వసు 4 పా. పుష్యమి, ఆశ్లేష

కష్టసుఖాలు సమానంగా చోటు చేసుకొంటాయి. ఊహించనిరీతిలో ధనవ్యయమవుతుంది. ఎంత పొదుపు చేయాలనుకున్నా వీలుకాదు. ఇష్టులైన వారికిగాను ఖర్చు అవవచ్చు. బంధుమిత్రుల సహాయ సహకారాలు అందుతాయి. గృహనిర్మాణము లేదా వసతి గృహాన్ని అమ్మడం అనే పనులలో నిమగ్నమవుతారు. శరీరానికి గాయాలు తగులకుండా చూసుకోవాలి. పాదాలు రుగ్నాలవుతాయి.



సింహం
మఖ, పుబ్బ ఉత్తర 1 పా

వాహనాలు జాగ్రత్తగా నడపాలి. అనుకొన్నపనులన్నీ అనుకొన్న రీతిలో ప్రణాళికా బద్ధంగా జరుపుకొంటూపోతారు. ఉద్యోగవృద్ధి, వేతనవృద్ధి ఉంటుంది. చిరకాలంగా ఎదురు చూస్తూ వచ్చిన శుభ ఫలితాలు అనుభూతిలోనికి వస్తాయి. శత్రువులు లొంగి నడచుకొంటారు. బంధువులకు మీ చేతనైన సహాయం చేస్తారు. ఆరోగ్య విషయంలో జాగ్రత్త. రాజకీయులకు ప్రోత్సాహకరమైన కాలం.



కన్య
ఉత్తర 2,3,4పా, హస్త, చిత్తా 1, 2 పా

ప్రయాణాలలో సత్ఫలితాలు ఎదురుచూడవచ్చు. చిన్న చిన్న సమస్యలు ఎదురవవచ్చు. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. విదేశీప్రయాణావకాశాలు కానవస్తున్నాయి. గృహనిర్మాణ కార్యక్రమాలు చురుకుగా సాగుతాయి. మిత్రులు సాయమందిస్తారు. కుటుంబంలో సమస్యలు తీరుతాయి. కళాకారుల ప్రతిష్ఠ పెరుగుతుంది. దైవకార్యాల్లో చొరవ అధికంగా చూపుతారు. ఉద్యోగులకు శ్రమ అధికం.

వారఫలాలు

తేది 11-6-2011 నుండి 17-6-2011 వరకు వృషభ, మిథునాల్లో రవి, బుధులు; మేషంలో గురువు; వృషభంలో కుజ, శుక్ర, కేతువులు; వృశ్చికంలో రాహువు; కన్యలో శని; కన్య, తుల, వృశ్చిక, ధనుస్సుల్లో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగం

15 తేది చంద్రగ్రహణం. 11.54 నుండి 3.34 వరకు. జ్యేష్ఠ, మూల నక్షత్ర జాతకులు, వృశ్చిక, ధనుస్సు రాశుల వారు శాంతులు చేసుకోవాలి.

శుభ ముహూర్తాలు

11, 12 తేదీల్లో కర్కాటక లగ్నాన ఉ.08.00 నుండి 10.00 గంటల వరకు. సింహ లగ్నాన ఉ.11.00 నుండి 1.00గంట వరకు. మకర లగ్నాన రా. 8.30 నుంచి 10.30 గంటల వరకు. కుంభ లగ్నాన రా.11.00 నుంచి 1.00 వరకు.

17తేది మేష లగ్నాన తె.2.00 నుండి 3.00 గంటల వరకు శుభ ముహూర్తాలున్నాయి.

జూన్ తిథులు


జ్యేష్ఠ శుద్ధ

11	శని	దశమి	ప 12.10	గం.ల.వ
12	ఆది	ఏకాదశి	ఉ 9.52	గం.ల.వ
13	సోమ	ద్వాదశి	ఉ 7.22	గం.ల.వ
		త్రయోదశి	తె 5.10	గం.ల.వ
14	మంగళ	చతుర్దశి	తె 3.20	గం.ల.వ
15	బుధ	పౌర్ణమి	రా 1.44	గం.ల.వ

జ్యేష్ఠ బహుళ

16	గురు	పాడ్యమి	రా 12.27	గం.ల.వ
17	శుక్ర	విదియ	రా 11.57	గం.ల.వ

పి.ఎం.గోపాలాచారి
16/1020, పొగతోట, నెల్లూరు – 1.
E-mail:maripmgg@yahoo.com



తుల
చిత్తా 3,4 పా, స్వాతి, విశాఖ 1,2,3 పా

పొత్తికడుపుకు సంబంధించి ఇబ్బంది ఉండవచ్చు. జీవితభాగస్వామి బంధువులతో గొడవలుండవచ్చు. నోరు పారవేసుకోకుండడం మంచిది. వృత్తిలో మార్పు చేర్పులుండవచ్చు. వ్యాపారులకు కొంతవరకు మేలు. భాగస్వాములతో జాగ్రత్త. దైనందిన కార్యక్రమాలలో ఆటంకాలుండవచ్చు. విద్యార్థులకు ఒకమోస్తరుగా చదువు సాగుతుంది. ఉద్యోగులకు శ్రమ తగ్గముఖం పడుతుంది.



వృశ్చికం
విశాఖ 4 పా, అనూరాధ, జేష్ఠ

మిత్రులు సాయమందిస్తారు. పద్ధతి ప్రకారం పనులు నిర్వహిస్తారు. ప్రయాణాలు సుముఖంగా సాగుతాయి. ఆర్థిక లావాదేవీలు మీకనుకూలంగా ఉంటాయి. ఇన్నాళ్ళు ఆటంకాలతో అడ్డుపడ్డ పనులు ఊపందుకొంటాయి. నూతన ఉద్యోగావకాశాలు లభించవచ్చు. భూ భవనాల ద్వారా ఆదాయమార్గాలు సులభతరమౌతాయి. వ్యాపారులకు ప్రోత్సాహకరమైన వారం. రాజకీయులకు ప్రోత్సాహం తక్కువ.




ధనుస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా

పాదాలకు సంబంధించిన బాధలతోపాటు మర్మావయవ బాధలుంటాయి. సాధారణంగా గడచిపోతుంది. ఆర్థికవిషయాలు చక్కగా వుంటాయి. నూతన వస్త్రాభరణాలు కొంటారు. తండ్రి తండ్రివంటి వారికి ఇబ్బందులుండవచ్చు. గృహాలంకరణ విషయాలలో ఆసక్తి చూపుతారు. ఖర్చుకు వెరవరు. ప్రతి పనిలో దూకుడు అధికం. విద్యార్థులకు ప్రయోజనవంతమైన కాలం. అన్ని రంగాలలో ముందంజ వేస్తారు.



మకరం
ఉత్తరాషాఢ 2, 3,4 పా. శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా

చాలా ప్రోత్సాహకరమైన కాలం. వృత్తిరీత్యా ఉత్సాహం అధికమవుతుంది. ప్రయాణాలలో జాగ్రత్త. అనుకొన్న పనులు అనుకొన్న రీతిలో సాగుతాయి. సంతానమూలంగా సుఖశాంతులు లభిస్తాయి. వారి విద్యారంగం ప్రోత్సాహకరంగా ఉంటుంది. ధనవిషయంలో లోటుండదు. భవిష్యత్తుకు మంచి పథకాలు వేస్తారు. రాజకీయులకు అత్యంతం అనుకూలమైన కాలం. వ్యాపార విస్తరణ చేస్తారు.



కుంభం
ధనిష్ఠ 3,4 పా. శతభిషం, పూర్వ భాద్ర 1,2,3 పా

గాయాలు తగిలే అవకాశాలెక్కువ. జాగ్రత్త. సోదరుల సాయమందుతుంది. పనులు నిదానంగా సాగవచ్చు. ఒకటికి రెండుసార్లు ఆలోచించి చేయడం మంచిది. వ్యాపారులకు గడచిన వారంలో ఏర్పడ్డ నష్టాలను ఈ వారంలో పూడ్చుకో వీలవుతుంది. అప్పులు తీరుస్తారు. విద్యార్థులకు ఒకవిధంగా చదువు సాగుతుంది. ఇంటిలో వివాహ సంబంధ విషయాలు ప్రస్తావనకు వస్తాయి.



మీనం
పూర్వాభాద్ర 4 పా, ఉత్తరాభాద్ర, రేవతి

అనవసరపు విషయాలలో జోక్యం చేసుకోకుండడం మంచిది. ఆర్థిక విషయాలు కొంత తృప్తికరంగా ఉంటాయి. ప్రతి అడుగు ఆచితూచి వేయడం మంచిది. వ్యాపారులు భాగస్వాములతో సఖ్యంగా ఉండడానికి ప్రయత్నించండి. ఆర్థికలావాదేవీలలో జాగ్రత్త. కఠినంగా మాట్లాడవద్దు. రాజకీయులు తోటివారి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. పై వారిని విమర్శించకుండాలి. విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపాలి.

నైరుతి దోషాత్మకం... యజమాని 'జీవ' హరణం!

ఐ.చంద్రశేఖరరావు నెల్లూరు

** మా తండ్రి గారు ఈ మధ్య చనిపోయారు. ఇంటి ప్లాను, 'ఫ్యూ ఫోటో' పంపిస్తున్నాను.*

నైరుతి నిరుతి(రాక్షస) స్థానం, అక్కడ పెంపు, అగాధం, కోణవేధ, వీధిపోటు ఇలాంటి వన్నీ కూడా యజమానులకు రోగకారకమై క్రమేణా మృత్యువును కలుగజేస్తాయి. తాత్కాలికంగా 'నరఘోష' యంత్ర ప్రతిష్ఠ ఫలితాలనిస్తుంది.

పండా విఠల్‌రావు కావలి

** ఈశాన్యంలో మండపం వుండవచ్చా?*

ఈశాన్యం గదిలో దేవుడన్నారు కానీ ఈశాన్యంలో దేవుడనిలేదు కదా? ఈశాన్యం 'భార రహితం'గా వుండాలి! మండపాన్ని తీసివేసి, పశ్చిమంలో మండపం నిర్మించుకోండి.

పంట్ల మునికృష్ణ తడ

** ఆధ్యాత్మిక గురువుల 'జీవితం' రాజ్యాంతం నరకం ధృవంలా వుంది?*

వాస్తులోపాలు కొంత గ్రహ ప్రభావాలు కొంత సుఖభోగాలలో ఆత్మశక్తిని పెంచుకోక పోవడం ఇంకొంత 'అపాత్రుల్ని' దగ్గరకు చేర్చడం పూర్తిగా ఈ పరిస్థితుల్ని కల్పిస్తాయి.

డాక్టర్ లక్ష్మీశారద సికింద్రాబాద్

** పూజా పుష్పకంలో లేదుగానీ 'పూజా ధ్వరి'లో 'మండల పూజ' వుంది.*

యంత్రం ప్రతిష్ఠించిన మొదటి రోజు, నలభై యవ రోజు నిమ్మబలి, టెంకాయ సమర్పణ, పసుపుమూట ఈశాన్య స్థాన ప్రతిష్ఠ చేయాలి. ఈ పూజా విధానం 'ద్వాదశ పూజా అష్టకం'లో వుంది. 'పూజాధ్వరి' గ్రంథమే లేదు.

పి.ధనలక్ష్మీరాజ్యం గూడూరు

** పెద్దవాడికి అనారోగ్యం, చిన్నవాడు ధన వ్యయం చేస్తాడు.*

తూర్పు, పశ్చిమ దోషాల వల్ల ఇలా జరుగుతోంది. పెద్దవాడిది రాహుస్థితి, చిన్నవాడిది 'శని' స్థితి. ఇంటికి 'సుదర్శన యంత్ర' ప్రతిష్ఠ చేయించండి. కొంత ఫలితాలు కనిపించాక 'రత్నధారణ' చేయించాలి.

బైరెడ్డి నీలిమారెడ్డి కడప

** ప్లాటులో ఆగ్నేయం బెడ్‌రూంని ఎవరు ఉపయోగించాలి.*

అతిథులు, అభ్యాగతులకు మాత్రమే ఇది ఉపయుక్తం. గృహస్థు ఉపయోగించరాదు.

కమ్మర తులసి కర్నూలు

** ఈశాన్యంలో వృక్షం తీసివేశాము.*

మొత్తం స్థలంలో రెండు భాగాలే ఈశాన్యం. ఈశాన్యమేదో తెలీకుండా కాయలు కాస్తున్న 'గర్భిణి' వృక్షాన్ని తీసేశారు. వృక్షవేధ వృక్షఘోష నివారణకు 'నరఘోష' యంత్ర ప్రతిష్ఠ చేసుకోండి.

వాస్తు సందేహాలు సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

ఎం.ఆంజనేయశర్మ నెల్లూరు

** దిక్కు, భూమి రంగు, భూమి స్థితి వీటిని చూడాలంటారు నిజమేనా?*

స్థలం, దిక్కులు దంపతుల నక్షత్ర, రాశులను బట్టి నిర్ణయిస్తారు. భూమి విషయంలో మీరు చెప్పిన అంశాలు విశ్వకర్మ వాస్తులో సవిస్తరంగా వున్నాయి. "కులమెరిగి చుట్టరికం, స్థలమెరిగి నివాసం" అన్న పెద్దల వాక్కు నూరు శాతం నిజం.

పైడి రాధాకృష్ణ ఆత్మకూరు

** ఆమె ఆరోగ్యం నాకు ఆందోళనకరంగా వుంది?*

యంత్ర ప్రతిష్ఠ, రత్నధారణ, రుద్రాక్షపూజ తర్వాత యాభై శాతం బాగుందని మీరే రాశారు. ఆమె వ్యక్తిగతం, నమ్మిక, పూజ ఆమెను ఆత్మశక్తివంతురాలను చేస్తుంది. ఆ విధానంలో లోపం వుందేమో చూడండి.

నావూరు కస్తూరి రాపూరు

** వరుస మరణాలు, వ్యాధులు ఈ ఇల్లు ఏమైపోతుందోనని భయం?*

మీరు ఈశాన్య 'కుంభ ప్రతిష్ఠ'గానీ, సుదర్శన యంత్ర స్థాపనగానీ చేయండి. నిర్లక్ష్యం ప్రమాదకరం.

ఎ.విద్యాధరి పెనుగొండ

** జ్యోతిష శాస్త్రాన్ని గురించి మీకు తెలుసా?*

వేదాంగం జ్యోతిషం, సిద్ధాంత, హోర, సంహితలలో 'సంహిత' విభాగం వాస్తు శాస్త్రం. లగద మహర్షి జ్యోతిషశాస్త్రంలో నియమనిబంధనల కర్తగా ప్రాచీన గ్రంథాలు చెబుతున్నాయి.

మసీదు స్థలం కాజేసేందుకు రంగం సిద్ధం!



నెల్లూరు పరమేశ్వరి నగర్‌ను ఆనుకొని వున్న జామియా మసీదు స్థలం.

అధికారుల ఉదాసీనత, ప్రజాప్రతినిధుల సహకారం వుంటే ఎలాంటి భూముల నైనా ఆక్రమించేస్తున్నారు. ఒకసారి అక్రమణకు గురైన వాటిని స్వాధీనం చేసుకోవడం చాలా కష్టం. దీనికోసం అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళ్లాల్సి వుంటుంది. కళ్ల ముందే భూములను కబ్జాదారులు ఆక్రమిస్తుంటే ప్రేక్షకపాత్ర వహిస్తున్న అధికారులు ఆ తర్వాత నోటీసులు జారీ చేసి తాము ఏదో ఒరగ బెట్టినట్లు ప్రకటించుకుంటారు. కోట్ల రూపాయల విలువ చేసే భూములు ఆక్రమణకు గురౌతున్నా చూస్తూ వుంటున్నారేతప్ప నియంత్రించలేని పరిస్థితుల్లో అధికార యంత్రాంగం వుంది.

ఇందుకు ఉదాహరణగా నగరంలో వక్ఫ్‌బోర్డు భూముల్ని పేర్కొనవచ్చు. మన్సూర్‌నగర్‌కు ఎదురుగా వున్న పరమేశ్వరీనగర్‌లో నెల్లూరు పెద్ద పోస్టాఫీసు సందులోని జామియా మసీదుకు 13 ఎకరాల భూమి వుంది. ఈ భూముల్ని ఎలాగైనా దక్కించుకోవాలన్న ఉద్దేశంతో కొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, ముస్లిం నేతలు కలిసి రంగంలోకి దిగారు. తొలుత లీజు పేరుతో భూముల్ని తీసుకొని అనంతరం ప్లాట్లుగా విభజించి విక్రయించాలన్నదే వీరి ఆలోచన. దీనికి గాను మసీదు ముతవల్లీ అయిన మహిళ పేరిట భూమి మార్పిడికి వక్ఫ్‌బోర్డుకు దరఖాస్తు చేయించారు.

ఈ భూములపై కన్నేసిన కబ్జాదారులు జెండా వీధికి చెందిన ముస్లిం నేతలకు కూడా కొంత వాటా చెల్లించే విధంగా ముందస్తు ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తుంది. అయితే కొందరు ముస్లిం నేతలు ఇందుకు అంగీకరించకపోవడం, కోట్ల రూపాయల విలువ చేసే వక్ఫ్ భూములు ఒకరికే సొంత కావడం జీర్ణించుకోలేక పోయారు. అప్పటివరకు గుట్టుచప్పుడు కాకుండా నడుస్తున్న వ్యవహారం ఒక్కసారిగా బహిర్గతమైంది. జిల్లా కలెక్టరేట్‌లో వక్ఫ్‌బోర్డు ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తిపై రెండు వర్గాల నుంచి తీవ్ర వత్తిళ్లు రావడంతో ఆయన బదలీ చేయించుకొని ఖమ్మం వెళ్లిపోయారు.

> **శిఖరంవారి వీధిలోని జామియా మసీదుకు నెల్లూరు పరమేశ్వరి నగర్‌ను ఆనుకొని కోట్లాది రూపాయలు విలువ చేసే 13 ఎకరాల భూమి వుంది. ఈ భూమిని కాజేసేందుకు అధికార పార్టీ నేతలు, వారి అనుచరులైన ముస్లిం నాయకులు పావులు కదుపుతున్నారు**

ఇప్పటికే నగరంలో వివిధ ప్రాంతాల్లో వున్న వక్ఫ్‌బోర్డు భూముల్ని, స్థలాల్ని కొందరు ఆక్రమించుకుని పక్కా భవనాలు నిర్మించుకున్నారు. ప్రస్తుతం వున్న స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవాలన్న వుద్దేశంతో ముస్లిం యువకులు రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా నేరుగా జిల్లా కలెక్టర్‌ను కలసి సమస్య గురించి వివరించారు. పరమేశ్వరీ నగర్‌లో వున్న ఈ భూములను గుర్తుపట్టలేని విధంగా చదును చేయాలన్న ఆలోచనతో వున్నారు. భూకబ్జాదారులకు అధికారపార్టీకి చెందిన కొందరు నాయకులు సహకారం అందిస్తున్నారు.

మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఖాళీ స్థలాలు, పార్కులు అదృశ్యమైపోయాయి. వీటిని ఆక్రమించిన వారు ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకున్నా పట్టించుకొనే దిక్కులేకుండా పోయారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన జిల్లా కలెక్టర్ వక్ఫ్ బోర్డుకు చెందిన స్థలాలు, భూములను పరిరక్షించడంతోపాటు, మునిసిపల్ స్థలాలను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటే నగర ప్రజలు హర్షిస్తారు. భూకబ్జాదారుల్ని వదిలేస్తే భవిష్యత్‌లో మరికొన్ని స్థలాలను ఆక్రమించే ప్రమాదం వుంది.

సర్వేయర్ల కొరత

జిల్లాలో సర్వేయర్ల కొరత!

జిల్లాలో సర్వేయర్ల కొరత తీవ్రంగా వుంది. ఇళ్ల స్థలాలు, తెలుగు గంగ బ్రాంచి కాల్వల నిర్మాణం కోసం భూసేకరణతోపాటు గ్రామాల్లో రోజురోజుకు ఎక్కువవుతున్న భూవివాదాలను పరిష్కరించేందుకు సర్వేయర్ల అవసరం ఎంతైనా వుంది.

జిల్లాలో భూసేకరణకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భూసేకరణ చేసేందుకు అవసరమైన సర్వేయర్లు లేకపోవడమే ఇందుకు కారణం. బలహీన వర్గాల వారికి ఇళ్ల స్థలాల కోసం భూసేకరణ, తెలుగుగంగ ప్రాజెక్టులో భాగంగా బ్రాంచి కాల్వల నిర్మాణం కోసం భూసేకరణ చేయాల్సి వుంది. వీటితోపాటు గ్రామీణ ప్రాంతాల్లో అనేక భూసమస్యలు రోజురోజుకు అధికమవుతున్నాయి. వివాదాస్పదంగా మారిన భూములను సర్వే చేయాలన్నా సర్వేయర్ల అవసరం ఎంతైనా వుంది. రెవెన్యూశాఖలో అవసరమైన సర్వే సిబ్బంది లేకపోవడం వలన భూసేకరణతోపాటు భూసమస్యలు పెండింగ్‌లో పడిపోయాయి.

తెలుగుగంగ ప్రాజెక్టు, కండలేరు డ్యాం నిర్మాణంలో భాగంగా ఎక్కువ మంది సర్వేయర్లను ఇక్కడ నియమించారు. ఒక్కో మండలంలో ఇద్దరు సర్వేయర్లను నియమించినప్పటికి ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. మరొక సర్వేయర్ ఏదో ఒక పని మీద డిప్యుటేషన్‌పై వెళుతుంటాడు. పై ప్రాజెక్టుల నిర్మాణ కారణంగా గ్రామాలు వదిలిన నిర్వాహితులకు ఇళ్ల స్థలాల కోసం ఇంకా భూసేకరణ పూర్తికాలేదు. సర్వేయర్ల కొరత పేరుతో రెవెన్యూ అధికారులు కాలయాపన చేస్తున్నారు. దీంతో సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సర్వేయర్ల కొరత వుందన్న విషయం అధికారులకు తెలిసినా కూడా డిప్యుటేషన్లు మాత్రం రద్దు చేయడం లేదు.

బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అవసరమైన ఇళ్ల స్థలాలు, స్మశాన స్థలం ఏర్పాటుకు భూసేకరణ చేపట్టేందుకు రెవెన్యూ అధికారులు పెద్దగా ఆసక్తి చూపరు. అదే పరిశ్రమల ఏర్పాటు కోసం భూసేకరణ చేసేందుకు ఆసక్తి చూపిస్తారు. ఎందుకంటే పరిశ్రమల ప్రతినిధుల నుంచి వూహించిన దానికంటే ఎక్కువగా మామూళ్లు అందుతాయి. కాబట్టి అటువైపు సర్వేయర్లను పంపేందుకు ప్రాధాన్యతనిస్తుంటారు. నెలల తరబడి పరిశ్రమల కోసం భూసేకరణ చేయిస్తుంటారు. వున్న కొద్దిమంది సర్వేయర్లు కూడా బలహీన వర్గాల ఇళ్ల స్థలాల భూసేకరణ కోసం వెళ్లేందుకు నిరాకరిస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు లేక ఒకే ఇంట్లో రెండు, మూడు కుటుంబాలవారు జీవనం సాగిస్తున్నారు. వీరికి ప్రభుత్వం భూసేకరణ చేసి బయట వ్యక్తుల నుంచి కొనుగోలు చేయాల్సి వుంటుంది. భూముల కొనుగోలు కోసం ప్రభుత్వం ముందుకొచ్చినా భూసేకరణ మాత్రం జరగడం లేదు. అనేక గ్రామాల్లో స్మశానానికి వెళ్లేందుకు సరైన దారి లేక పొలాల్లోనే వెళ్లాల్సి వస్తుంది. వర్షాకాలంలో అయితే పొలాల యజమానులు, గ్రామస్తుల మధ్య వివాదాలు చోటుచేసుకొంటాయి. ఈ వివాదాలు చిలికిచిలికి గాలి వానగా మారి పోలీస్ స్టేషన్ల వరకు వెళ్తున్న సందర్భాలున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం కూడా సర్వేయర్ల ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టం లేదు. భూవివాదాలను త్వరితగతిన పరిష్కారంలో సర్వేయర్ల పాత్ర కీలకం. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి డిప్యుటేషన్లపై వెళ్లిన సర్వేయర్లను వారి స్థానాల్లో నియమించి బడుగు, బలహీన వర్గాల వారికి నివేశన స్థలాల భూసేకరణ చేపట్టడంతోపాటు భూ సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

నేను హాట్ బేబిని!



మల్లికా శెరావత్ తీరు మారలేదు. నేను గొప్ప అంటూ సొంత డబ్బా కొట్టుకోవడం మానలేదు. కేన్స్ చిత్రోత్సవంలో ఈ అమ్మడు ఆనవాయితీ ప్రకారం హాట్‌హాట్‌గా కనిపించినా మార్కులన్నీ ఐశ్వర్యరాయ్, సోనమ్ కపూర్‌లు పట్టుకెళ్లిపోయారు. అయినా సరే... మల్లిక... మళ్లీ మళ్లీ తానే గొప్ప అని చెప్పుకొంటుంతోంది. "కేన్స్‌లో నేను హాట్ హాట్‌గా కనిపించాను" ఈ చిత్రోత్సవంలో చాలామంది తారలు పాల్గొన్నారు. ర్యాంప్ షోలో అందాల్ని ఆరబోశారు. వీరిలో బిట్నీ స్పియర్, విన్సే లోహన్ వంటి అగ్ర హీరోయిన్లు వున్నారు. అయితే వెబ్‌సైట్లు, స్థానిక పత్రికలు నా చిత్రాలే ఎక్కువగా ప్రచురించాయి. మీడియాలో నాకే ఎక్కువ ప్రచారం లభించింది. ఆ లెక్కన నేను హాట్ కదా అని మురిసిపోతూ చెప్పింది.

ఐదారేళ్ల తర్వాత పెళ్లి



తెలుగులో బిజీగా వున్న హీరోయిన్ కాజల్ హిందీ చిత్రం సింగం'లో నటించను గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ విషయమై మాట్లాడుతూ బాలీవుడ్‌లో స్థిరపడాలనేది నా అభిమతం కాదు. నాకు సరిపడే కథలు వస్తే... చేస్తాను. తెలుగు పరిశ్రమను వదలుకోను. ఒకేసారి తెలుగు, హిందీ సినిమాల అవకాశాలు వస్తే తెలుగు సినిమానే ఎంచుకొంటాను. ఏ భాషలోనైనా బికినీలో నటించే అవకాశమే లేదు. ప్రేమ గూర్చి ఆలోచించే తీరిక లేదు. ఇక పెళ్లి అంటారా? దానికి ఇంకా ఐదారేళ్ల సమయం వుంది. పెద్దలు కుదిర్చిన వివాహమే చేసుకొంటాను. అందులో సందేహం వద్దని తేల్చేసింది.



తెలుగులో నీరాజనం, నాయకుడు చిత్రాల్లో హీరోయిన్‌గా నటించిన శరణ్యకు ఈ యేడాది తమిళ చిత్రం 'తెన్మేర్కుపరువకాట్రు'లో నటనకు గాను ఉత్తమ నటిగా జాతీయ అవార్డు లభించింది. ఈ విషయమై ఆమె మాట్లాడుతూ నాకు జాతీయ అవార్డు వచ్చిందని తెలియగానే ఆశ్చర్యపోయాను.

ఆశ్చర్యపరచిన అవార్డు

మొదట నేను నమ్మలేదు. అవార్డు రావాలని నేను ఆశించలేదు. కాబట్టి ఇది నిజమైన అవార్డు. ప్రతిభకు గుర్తింపు అనిపించింది. దర్శకుడు చెప్పినట్లుగా, కథకు న్యాయం చేసేలా నటించడమే నేను చేశాను. దర్శకుడు చెప్పిట్లు 'తెన్మేర్కుపరువకాట్రు'లో తల్లి పాత్ర కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకొన్నానని వివరించింది.

అతను స్నేహితుడే...



బాలీవుడ్ భామ ప్రియాంకా చోప్రా, షాహిద్ కపూర్ల ప్రేమాయణం గూర్చి బాలీవుడ్‌లో అందరికీ తెలిసిందే. కానీ ప్రియాంక మాత్రం షాహిద్ తనకో మంచి స్నేహితుడని చెబుతుంది. నేను షాహిద్ కపూర్‌ను పెళ్లి చేసుకోనున్నట్లు వస్తున్న వార్తలన్నీ పుకార్లే. నేను బాగుండాలని కోరుకొనేవాళ్లలో షాహిద్ ఒకడు. అయినా నా పెళ్లికి తొందర లేదు. నేను కోరుకొనే లక్షణాలు కలిగిన వ్యక్తి తారసపడ లేదు. నా మనసుకు నచ్చిన వ్యక్తి దొరికినపుడే పెళ్లి పీటలమీద కూర్చొంటానంటుంది.

ఇలియానా వ్యాపారం



గోవా సుందరి హీరోయిన్ ఇలియానా తన పేరునే బ్రాండ్‌గా మార్చేసింది. ఆ పేరుతోనే హైదరాబాద్‌లో ఓ బొటిక్ ప్రారంభించింది. ఇందులో డిజైనర్ దుస్తులున్నాయి. వాటన్నింటినీ ఇలియానా తల్లి సమీరా డిజైన్ చేస్తారంటుంది. నటన తోపాటు వ్యాపారరంగంలోనూ దిగారా అంటే ఆ వ్యాపారాలన్నీ మా మమ్మీవే. నాకె లాంటి సంబంధం లేదు. నేను జస్ట్ బ్రాండ్ అంబాసిడర్‌ని మాత్రమే. తనకు వ్యాపార సూత్రాలు తెలియవంది. వ్యాపారాల్ని విస్తరిస్తారా అంటే గోవాలోనూ మరో శాఖ పెడతాం. స్పా, రెస్టారెంట్లను పెట్టాలని నిశ్చయించుకొన్నామంటుంది ఇలియానా. వేషాలు తగ్గినా వ్యాపారంలో ఇలియానా బిజీ అయిపోవడం ఖాయం.

తలనొప్పి తెచ్చే దుశ్శాసన!



✍ అల్లూరు రహీం

సమకాలీన రాజకీయాలపై దర్శకుడు, నిర్మాత, నటుడు కూడా అయిన పోసాని కృష్ణమురళి ఎన్నో వ్యంగ్యాస్త్రాలను సంధించినా వాటిలో విజయవంతమైన చిత్రం ఆపరేషన్ దుర్యోధన మాత్రమే. తాను హీరోగా చేస్తూ రాజకీయ వ్యంగ్యాస్త్రాలను తీస్తే జనం చూడడం లేదని భావించిన పోసాని పాత బాణీలో శ్రీకాంత్‌ను హీరోగా పెట్టి తీసిన చిత్రమే దుశ్శాసన. 'అతి సర్వత్ర వర్జయేత్' అన్న విషయం కృష్ణమురళికి ఎప్పుడు తెలిసొస్తుందో? దుశ్శాసనలో కొన్ని సన్నివేశాలు అతిగా తోస్తాయి. రాష్ట్ర మంత్రులను ఒక వ్యక్తి చెప్పులతో కొట్టి, కార్పొరేషన్ నీళ్లకై క్యూలో నిలబెట్టి, పైన పెంట నీళ్లుపోసి హాయిగా తిరగగలగడం సాధ్యమా? హీరో ఈ చిత్రంలో ఒక డైలాగ్ తరచూ చెబుతుంటాడు. నా మాట విన్నారా మేరా భారత్ మహాన్ లేకుంటే నా బాల్‌కా బరా బర్. మేరా భారత్ అనే గొప్ప పదానికి వెనుక చేర్చిన గలీజు బూతును అర్థం చేసుకోలేని వాజమ్ములు సెన్సార్ బోర్డులో వుండడం మన దౌర్భాగ్యంగా చెప్పుకోవాలి. అదేవిధంగా ఓటరు లిస్టులో పేరు లేకుంటే ఆ వ్యక్తి భారతీయుడే కాదని చెప్పడం ఏ మేరకు సమంజసం. మన దేశంలో ఓటర్ల లిస్టులు ఎంత అవకతవకగా తయారవుతున్నవో ఎంఫిల్ చదివిన కృష్ణమురళికి తెలియదా? అయితే ఓటువేయని వ్యక్తులు రేషన్ కార్డు, టెలిఫోన్, గ్యాస్ ఇతర సౌకర్యాలు ఉపయోగించుకొనే హక్కు లేదనే వాదన బాగుంది. వ్యభిచార గృహాలు మూయించమన్న మహిళలను ముందు సిగరెట్లు, సారా, గుట్కాలపై పోరాటం చేయమనడం, ఆ సన్నివేశంలో వాళ్లను తక్కువ చేస్తూ చూపడం బాగోలేదు. మహిళల బహిరంగ మల విసర్జన సన్నివేశం వెండితెరపై చూపను దుశ్శాసన ఏమైనా ఆర్ట్ సినిమానా? గవర్నర్ రాజ్యాంగానికి ప్రతినిధి తప్ప రాష్ట్రంలోని శాంతిభద్రతలు లోపించినప్పుడు ఆయనే సిఎం, మంత్రి మండలిని కాదని సమావేశాలు నిర్వహించి సందేశాలు ఇవ్వడం ప్రజాస్వామ్యంలో సాధ్యమా? ఎన్నికల్లో అభ్యర్థుల ప్రత్యక్ష ప్రచార పర్వానికి తెరవేస్తూ ఎన్నికల కమీషన్ టీవీలు, పత్రికల ద్వారా నిర్వహించాలన్న సూచన బాగుంది. పదునైన కలంతో పోసాని వ్రాసిన మాటల్లో ఎన్నికలొచ్చాయంటే ప్రజలకు డబ్బు సారా పండగొచ్చినట్లే. ఇది మొద్దు నిద్ర ప్రభుత్వం. ఎమ్మెల్యేలు ప్రజలకంటే గొప్పవారా? రాజకీయాలను వ్యభిచారస్థాయికి తెచ్చారు. ఆశయం గొప్పదీ... అమ్మా గొప్పదీ డైలాగులు బాగున్నాయి. ఈ చిత్రం ప్రథమార్థంలోని బెల్లాన్ని చూడగానే చరణంతోసాగే ఐటెమ్‌పాట, అక్కడక్కడా పల్లెసుద్దుల తరహాలో వినపడే జిందాబాద్, కామన్ మేన్ పాట బాగుంది.

చిత్ర కథలోనికి వెళ్తే కామన్ మేన్(శ్రీకాంత్) రాష్ట్రంలో శాంతి కనపడడం లేదని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తాడు. హాస్పిటల్‌కు వెళ్లి తొమ్మిది నెలలు నిండిన మహిళలను అబార్షన్ చేయించుకోమంటాడు. పోస్టాఫీసుకు వెళ్లి ఎన్టీరామారావు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డిలకు స్వర్గం చిరునామాగా రిజిష్టర్ పోస్టు పంపమని కోరుతాడు. నీరు, విద్యుత్, మల మూత్ర శాలలు లేకుండా సామాన్య జనం బాధ పడుతుండగా మంత్రుల త్రయం కోట శ్రీనివాసరావు, తనికెళ్ల భరణి, చలపతిరావు సర్వసౌఖ్యాలు అనుభవించడాన్ని ప్రశ్నించి వాళ్లను వీధిలో చెప్పులతో కొడతాడు. సిఎం(బాలయ్య) కుమార్తె విజయలక్ష్మి(సంజన), టివి9 రిపోర్టర్ సునీత(తషుకౌశిక్)ను కిడ్నాప్‌చేసి కామన్ మేన్ రాష్ట్రంలో సంచలనం రేకెత్తిస్తాడు. గవర్నర్(అంబికా కృష్ణ) కామన్ మేన్‌ను చర్చలకు పిలవగా రాజకీయాల్లో వికృత స్వరూపాన్ని ఎండ గడతాడు. రాజకీయాల్లో ఒక పద్ధతి రావాలని, ఎన్నికల సంస్కరణలు తప్పనిసరంటాడు. మంత్రుల త్రయం ఆరాతీయగా కామన్ మేన్ పూర్వాశ్రమంలో తాము ఇబ్బందులు పాలుజేసిన మహేష్‌గా గుర్తిస్తారు. ఇక ఇక్కడ నుంచి సినిమా పాత తరహా ఫార్ములా ప్రకారం కక్షలు తీర్చుకొనే స్థాయికి వస్తుంది. అంతిమంగా కామన్ మేన్ మంత్రుల నీచ రాజకీయాన్ని బయటపెట్టి నా మాట విన్నారా మేరా భారత్ మహాన్... లేకుంటే నా బాల్ కా బరా బర్ అని వెళ్లిపోవడంతో చిత్రం ముగుస్తుంది.

చిత్ర సమీక్ష

చిత్రంలో శ్రీకాంత్ నటన పరవాలేదు. కోట శ్రీనివాసరావు, చలపతిరావు, తనికెళ్ల భరణిల నటన టీవీ నాటకాలను గుర్తుకు తెస్తుంది. సీరియస్‌నెస్ రాజకీయాలే తప్ప కామెడీ లేకపోవడం ఈ సినిమాను సాధారణ ప్రేక్షకుడు చూడడం కాస్త కష్టమే.

● నిఘార్స్‌గా నివేదిక ఇచ్చిన ఎసిబి

స్కూళ్ల నిర్వాహకుల గుండెల్లో రైళ్లు!



దడపుట్టిస్తున్న ఎసిబి అధికారులు.

తీగ లాగితే డొంక కదిలిందన్న చందంగా వుంది జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల వ్యవహారం. ప్రభుత్వ నియమ నిబంధనలేవీ పాటించకుండా విద్యా శాఖ అధికారులు, సిబ్బందికి లంచాలు విదిలించి అక్రమాలకు పాల్పడుతున్న పాఠశాలల యాజమాన్యాలకు చెమటలు పట్టిస్తున్నారు ఎసిబి అధికారులు. నగరంలో పాఠశాలల ఏర్పాటు, అనుమతుల విషయంలో ఏర్పడిన వివాదంపై ఎసిబి అధికారులు విచారణ జరపడంతో పలు అవకతవకలు బట్టబయలయ్యాయి. డిఇఓ కార్యాలయ సిబ్బంది యాజమాన్యాల వద్ద ముడుపులందుకొని పాఠశాలల ఏర్పాటుకు అనుమతిచ్చారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది తమ వంతు పాత్ర పోషించారు. నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ జారీలో అవకతవకలకు పాల్పడ్డారు. దీనిపైనా ఎసిబి అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడంతో అటు అక్రమాలకు పాల్పడిన ఉద్యోగులతోపాటు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. దాదాపు 42 పాఠశాలలు నిబంధనలేవీ పాటించకుండానే ఎన్‌ఓసి పొంది వున్నారట. ఈ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని ప్రభుత్వం భావిస్తుండడంతో పలువురు ఈ సమస్య నుంచి బయటపడేందుకు నేతల వద్దకు పరుగులు పెడుతున్నారు. రాజకీయ అండతో గట్టెక్కేందుకు తమ వంతు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

ఓటర్ల జాబితా సక్రమంగా ఉండాలి!



అదనపు జెసి సీతారామయ్య ఆకాంక్ష.

స్థానిక సంస్థల కోసం సిద్ధం చేస్తున్న ఓటర్ల జాబితాను ఇష్టం వచ్చినట్లు తయారు చేయకుండా పారదర్శకంగా వుండే విధంగా చర్యలు తీసుకోవాలని అదనపు జాయింట్ కలెక్టర్, కార్పొరేషన్ ప్రత్యేకాధికారి టి.సీతారామయ్య సూచించారు. 4వ తేది కార్పొరేషన్ కార్యాలయంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్పొరేషన్ పరిధిలో 50 డివిజన్లున్నాయని, ఇవి నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల పరిధిలోకి వస్తాయన్నారు. ఓటర్ల జాబితాను డివిజన్ల వారీ సరిహద్దులతో తయారు చేయాలన్నారు. ఇంటి నెంబర్లు, ఫోటో గుర్తింపు జాబితాలో వుంటే సమస్యలు ఉత్పన్నం కావన్నారు. వివిధ పార్టీల నుంచి వచ్చే అభ్యంతరాలను స్వీకరించి వాటిని సరిదిద్దడానికి అధికారులు సిద్ధంగా వుండాలన్నారు. ఓటర్ల జాబితాను పారదర్శకంగా తయారు చేయడానికి బిల్ కలెక్టర్లు, ప్లానింగ్ అధికారుల సహాయం తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి అర్హులైన వారికి మాత్రమే ఓటు హక్కు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో నెల్లూరు ఆర్డీఓ వేణుగోపాల్‌రెడ్డి, కమిషనర్ టిఎస్ ఆర్ ఆంజనేయులు, తహశీల్దార్ భక్తవత్సలరెడ్డి పాల్గొన్నారు.

సైన్యంలో చేరను యువత ఉత్సాహం!

● వేలాదిగా తరలివచ్చారు



ఆర్మీలో చేరగోరిన యువకులకు పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం.

నెల్లూరులో 5, 6 తేదీల్లో నిర్వహించిన ఆర్మీ రిక్రూట్‌మెంట్‌కు విశేష స్పందన లభించింది. ఇందుకోసం గత నెల రోజుల నుంచి అధికార యంత్రాంగం మన జిల్లాతోపాటు కడప, చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు దొరకని అభ్యర్థులు ఈ రిక్రూట్‌మెంటుకు హాజరైనారు. నగరంలోని ఎసి సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన రిక్రూట్‌మెంటుకు హాజరైన అభ్యర్థులకు పరుగుపందెం, ఛాతి కొలతలు తీసుకోవడం పూర్తి చేశారు. రెండు రోజులపాటు జరిగిన రిక్రూట్‌మెంట్‌కు నాలుగు జిల్లాల నుంచి రెండు వేల మంది హాజరైనారు. ఎంత మంది ఎంపికయ్యారన్న విషయం మాత్రం అధికారులు ప్రకటించ లేదు. సైనిక అధికారులతోపాటు, జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ రెడ్డి, ప్రభుత్వ శాఖలకు చెందిన పలువురు అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి

పేదలకు వైద్యం అందాలి



వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి సమీక్షలో పాల్గొన్న జిల్లా అధికారులు.

ప్రభుత్వం పేద, బలహీన వర్గాల కోసం అమలు చేస్తున్న వైద్య సేవా పథకాలను పూర్తిస్థాయిలో అందించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ పి.వి.రమేష్ సూచించారు. 4వ తేది హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారు. జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ కార్యక్రమం నిర్దేశించిన ఆరోగ్య సేవలను పటిష్టంగా అమలు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని సబ్ సెంటర్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు సక్రమంగా సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత వైద్య, ఆరోగ్యశాఖ భవనాలకు మరమ్మత్తులు నిర్వహించడంతోపాటు మందులు, రక్తం, వైద్య చికిత్సకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందించాలన్నారు. అదేవిధంగా పిహెచ్‌సి, సబ్ సెంటర్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వైద్య సిబ్బంది, ఎఎన్ ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్లను పూర్తిస్థాయిలో నియమించి 24 గంటలు వైద్య సేవలు అందించాలన్నారు. జిల్లా కలెక్టర్లు తరచుగా తనిఖీలు నిర్వహించి ఆరోగ్య సేవలను పూర్తిస్థాయిలో అందేలా చూడాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలను ప్రభుత్వ ఆసుపత్రులలో సిద్ధంగా వుంచుకోవాలని, జిల్లా కలెక్టర్లు, వైద్య ఆరోగ్య అధికారులు, మునిసిపల్ అధికారులు అవసరమైన సమావేశాలు ఏర్పాటు చేసుకొని మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ బి.శ్రీధర్ రెడ్డి, అదనపు జాయింట్ కలెక్టర్ టి.సీతారామయ్య, ఇన్‌ఛార్జ్ డిఎం అండ్ హెచ్‌ఓ దశరధరామయ్య, కమిషనర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణం కోసం పచ్చటి సంతకం



గాంధీబొమ్మ వద్ద సంతకాల ఉద్యమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు.

జనవిజ్ఞాన వేదిక జూన్ 5వ తేది ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లో నిర్వహించింది. పర్యావరణం కోసం పచ్చని సంతకమంటూ ప్లాస్టిక్ కవర్ల వాడకం చేయమంటూ ప్రతిజ్ఞ చేసి పర్యావరణ బ్యానర్‌పై పలువురు సంతకాలు చేశారు. పర్యావరణానికి సమస్యగా మారిన ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులు వాడమని తెలుపుతూ గుడ్డ సంచుల అమ్మకాన్ని ఎన్.నారాయణ ప్రారంభించారు. జిల్లాలో 20 కిలోమీటర్ల పరిధిలో 35వేల మెగా విద్యుత్ ధర్మల్ కేంద్రాలను ఏర్పాటు చేయడం పర్యావరణాన్ని దెబ్బతీస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి శ్రీధర్‌బాబు, అల్లూరు రాజు, హజరత్తయ్య, తిక్కవరపు సుకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు అమ్మ ఫర్నిచర్ మాల్ అధినేత గద్దం సుధాకర్‌రెడ్డి రెండవ కుమారుడు సుజన్‌రెడ్డి, సుప్రియల వివాహం జూన్ 3వ తేది జిపిఆర్ గ్రాండ్ కళ్యాణ మండపంలో జరిగింది.

పిసిసి పెద్దగా సత్తిబాబు

మొదటి పేజీ కొరవ

సరే ఆ ఎన్నికలలో అంత ఘోరంగా పరాజయం తప్పలేదంటే ఇక ఏమి చేసినా రెడ్డి కులస్తులు కాంగ్రెస్‌కు అనుకూలం కారనే అర్థం కదా అన్నది ఇప్పుడు ఢిల్లీ దేవిడీలలో విన్పిస్తున్న వాదన. రెడ్లు ఎటూ ఇక మనతో రారని తెలిసిపోయింది కాబట్టి, కమ్మ కులస్తులు చంద్రబాబుతోనే అంట కాగుతున్నారు కాబట్టి, ఆ రెండింటికీ సమానంగా పలుకుబడి, జనాభా కల్గిన కాపు కులానికి దగ్గర కావడమే కాంగ్రెస్ ముందున్న తరుణోపాయమని వారు భావిస్తున్నట్లు చెప్తున్నారు. అందువల్లనే సత్తిబాబును రంగంలోకి దింపడంతోపాటు, చిరంజీవికి పెద్ద పీట వేయడానికి రంగం సిద్ధం చేస్తున్నారు.

సత్తిబాబు వల్ల కాపు కులానికి ప్రాధాన్యత ఇచ్చారన్న ప్రచారంతోపాటు, రాజకీయంగా జగన్‌తో ఢీకొనే సామర్థ్యం కల్గిననేత కూడా దొరికినట్లైందన్నది వారి ఉద్దేశం. దానికి తగినట్లే నియామక పత్రం చేతిలోకి వచ్చిన పక్క క్షణం నుంచి సత్తిబాబు జగన్‌పై కాలు దువ్వుతున్నాడు. జగన్‌తో వెళ్లే ఎమ్మెల్యేల మీద క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరిక చేస్తున్నాడు. జగన్‌తో నడిచే ఎమ్మెల్యేలున్న నియోజకవర్గంలో కాంగ్రెస్ ఇన్‌ఛార్జీలుగా వేరే వారిని నియమించి, అధికారిక కార్యక్రమాలన్నీ వారి ద్వారానే జరిపించాలని ముఖ్యమంత్రికి నివేదించాడు. జగన్ అనుకూల ఎమ్మెల్యేల మాట చెల్లుబాటు కాకుండా చూడడానికి చర్యలు చేపడుతున్నాడు.

సత్తిబాబు వ్యూహం, విధానాల వల్ల జీవం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీకి ప్రాణ ప్రతిష్ట జరుగుతుందనే భ్రమలు ఎవరిలో లేకపోయినా, కాంగ్రెస్ కార్యకర్తలలో మాత్రం ఉత్సాహం పాదుకొనడం ఖాయం. ఇప్పుడున్న పరిస్థితులలో ఆ మాత్రం మార్పు కూడా కాంగ్రెస్‌కు మృత సంజీవని మందు వంటిదే అనడంలో సందేహం లేదు.

సత్తిబాబు నియామకం ద్వారా తెలంగాణ ఉద్యమకారులకు ఏ సంకేతం పంపించారన్నది మరొక ప్రశ్న. ముఖ్యమంత్రి, పిసిసి అధ్యక్షులిరువురినీ ఆంధ్ర ప్రాంతం నుంచే ఎంపిక చేయడం సాంప్రదాయానికి విరుద్ధం. తెలంగాణ ఉద్యమం మంచి ఊపుమీదున్న సమయంలో ఆ నిర్ణయం ప్రకటించడం వెనుక ఏ ఉద్దేశం వుందో ఎవరికీ అర్థం కావడం లేదు. తెలంగాణ ఇవ్వడానికి సిద్ధపడి ఆ ఎంపిక చేశారా, లేక తెలంగాణాను ఎట్టి పరిస్థితుల్లో ఇచ్చేదిలేదని స్పష్టం చేయదలచుకొన్నారా అన్నది బోధపడడం లేదు.

తన గొయ్యి తానే తవ్వుకుంటున్న జగన్!

ఇదిట్లా వుంటే ఎమ్మెల్యేలను ఆకర్షించే విషయంలో కిరణ్ సర్కారుపై అవిశ్వాసం పెట్టే విషయంలో వైఎస్ జగన్ పన్నిన వ్యూహాలు బెడిసి కొడుతున్నాయి. తన బలం అంచనా వేసుకోకుండా, ఎమ్మెల్యేల మనోభావాలు తెలుసుకోకుండా తాను తలచుకుంటే కిరణ్ సర్కారును చిటికెలో పడగొట్టగలనని రంకెలు వేశాడు జగన్. ఆయన బలమెంతో ఆయనకు అర్థమయ్యేట్లు చెప్పడానికి కిరణ్‌కుమార్‌రెడ్డి అవిశ్వాసం బదులు స్పీకర్ ఎన్నికను ముందుకు తెచ్చాడు. ఆ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌కు వచ్చిన ఓట్లు 158. తెలుగుదేశానికి 90 వచ్చాయి. జగన్ దగ్గర నిజంగా 30 మంది ఎమ్మెల్యేలు వుంటే, టిఆర్ఎస్‌తో జత కలిసి కాంగ్రెస్ స్పీకర్ అభ్యర్థిని ఓడించి వుండవచ్చు. కిరణ్ సర్కారు మైనార్టీలో పడిందన్న నిజాన్ని లోకానికి చాటి చెప్పి వుండవచ్చు. కానీ జగన్ ఎమ్మెల్యేలు బుద్ధిమంతుల వలె కాంగ్రెస్ విప్ జవదాటకుండా ఓటు చేశారు. దానితో జగన్ దగ్గర నిజంగా ఎమ్మెల్యేలున్నారా, వున్నా వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరించడానికి సిద్ధపడుతున్నారా అన్నది అంతుచిక్కని ప్రశ్నగానే మిగిలి పోయింది.

ఎమ్మెల్యేలలో అసహనం

మరొకవైపు ఇప్పుడు మధ్యంతర ఎన్నికలు వచ్చినా, మూడేళ్ల తర్వాత ఎన్నికలు జరిగినా తనతో వుండే ఎమ్మెల్యేలకు మళ్లీ టిక్కెట్ ఇస్తారన్న హామీ ఇవ్వలేనని జగన్ బహిరంగంగా చేసిన ప్రకటన తీవ్ర కలవరం కల్గిస్తున్నది. మళ్లీ టిక్కెట్ ఇవ్వడం గ్యారంటీ లేనప్పుడు ఆయనతో వెళ్లడం ఎందుకన్న నిరాశ, అసహనం జగన్ దగ్గరున్న ఎమ్మెల్యేలలో కల్గుతున్నాయి. కొత్త పిసిసి అధ్యక్షుడు సత్తిబాబు జగన్ ఎమ్మెల్యేలను వారి నియోజకవర్గాలలో ప్రతిపక్షం క్రింద పరిగణించమని ఆదేశించడం వారిని మరింత కలవరపెడుతున్నది. ఎన్నికలకు ఇంత ముందుగా నియోజకవర్గాలలో అధికారానికి దూరమైతే తమ దగ్గర అనుచరులు మిగలరని భయపడుతున్నారు వారు. తమ స్థానంలో కొత్త నాయకత్వం పెరిగితే ఆ తర్వాత మా సంగతేమిటని ప్రశ్నించుకొంటున్నారు. మొత్తానికి అనుభవరాహిత్యంతో, తొందరపాటుతనంతో జగన్ తన రాజకీయ గోతులను తానే త్రవ్వుకొంటున్నాడని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

నెల్లూరు ముచ్చట్లు

3వ పేజీ కొరవ

2వ తేది అందించారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు డి.వాణి కూడా పాల్గొన్నారు.

విజయ లేబొరేటరిలో రాయితీలు

నగరంలో ఇందిరాభవన్ వద్ద గల విజయ లాబొరేటరీ 26వ వార్షికోత్సవం సందర్భంగా వివిధ టెస్టులపై డిస్కౌంట్ ప్రకటించింది. అధికబరువు, లావు తగ్గింపుతోపాటు అన్నీ రోగ నిర్ధారణ పరీక్షలపై 20% డిస్కౌంట్ ఇస్తున్నట్లు లేబొరేటరి నిర్వాహకుడు డాక్టర్ పెంచలరెడ్డి తెలిపారు. స్థూలకాయులకు ఉచిత కౌన్సిలింగ్, ఫిటినెస్‌కు సంబంధించి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. వివరాలకు 2324405, 98665 34908లో సంప్రదించండి.

బొత్సాకు పదవిపై హర్షాతిరేకాలు

బొత్సా సత్యనారాయణకు పిసిసి అధ్యక్ష పీఠం కట్టబెట్టడంపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు హర్షాతిరేకం వ్యక్తం చేశారు. ఆయనకు పదవి వచ్చినట్లు సమాచారం అందుకోగానే ఎసి సెంటర్‌లో టపాసులు పేల్చి స్వీట్లు పంచి పెట్టారు. సత్తిబాబుకు పదవి రాగానే ఆనం అనుచరగణం ఇలా కేరింతలు కొట్టడం చర్చనీయాంశమయ్యింది.

పెన్నా సాహిత్య పురస్కారం

ప్రతిష్టాత్మక పెన్నా సాహిత్య పురస్కారం – 2011 కోసం పెన్నా రచయితల సంఘం ఆహ్వానించిన వచన కవితా సంపుటాలలో చీరాలకు చెందిన యువ కవి పి.శ్రీనివాస్‌గౌడ్ వ్రాసిన ఒక మెలకువ ఎంపికయ్యింది. 17వ తేది టౌన్‌హాల్ పఠన మందిరంలో జరిగే సభలో సాహిత్య పురస్కారం, ఐదువేల రూపాయల నగదు, సత్కారం చేస్తామని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మోపూరు పెంచల నరసింహం, గుండాల నరేంద్రబాబు చెప్పారు.

అన్నీ అక్రమ లేఅవుట్లే!

జిల్లావ్యాప్తంగా లే అవుట్లలో 90 శాతం అక్రమ లేఅవుట్లేనని జాయింట్ కలెక్టర్ సొరభ్‌గౌర్ తెలిపారు. చిట్టమూరులో పర్యటించిన ఆయన మాట్లాడుతూ చివరకు గ్రామాల్లో సైతం అక్రమ లే అవుట్లు వున్నా కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

బిజెపి వినూత్న నిరసన

నల్లధనం వెలికితీయాలని బాబా రామ్‌దేవ్ చేపట్టిన దీక్షను పోలీసులు భగ్నం చేయడాన్ని నిరసిస్తూ బిజెపి కార్యకర్తలు నగరంలో వినూత్నంగా నిరసన చేపట్టారు. కళ్లకు నల్లగుడ్డలు కట్టుకొని విఆర్‌సి నుంచి గాంధీబొమ్మ వరకు ప్రదర్శన నిర్వహించారు. గాంధీ విగ్రహానికి నల్లగుడ్డ కప్పిన అనంతరం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం బాబా రామ్‌దేవ్ దీక్షను భగ్నం చేయడాన్ని ఖండించారు. ఎబివిపి ఆధ్వర్యంలో సోనియా గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.

తగులబడిన ఎటిఎం సెంటర్

నెల్లూరు ఆర్టీసి బస్టాండు వద్ద గల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎటిఎం సెంటర్ తగుల బడింది. జూన్ 6వ తేది సోమవారం నాడు ఒక్కసారిగా ఎటిఎం నుంచి మంటలు చెలరేగాయి. చుట్టు ప్రక్కల వాళ్లు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. అప్పటికే కంప్యూటర్లు ఎసి తదితర పరికరాలు కాలిపోయాయి. ఎటిఎంలో వుండే నగదు కాలిపోయిందా లేదా అనేది తెలియడం లేదు. మొత్తం మీద లక్షకు పైగా నష్టం సంభవించినట్లు సమాచారం.

జనవాణి

2వ పేజీ కొరవ

కౌన్సిలింగ్ ద్వారా పరిష్కరించాలి. రాజకీయ ఒత్తిడుల మూలంగా చేసే బదలీలతో వుద్యోగులు ఇబ్బందులు పడతారు.

రావూరి సురేంద్రనాథ్ నెల్లూరు

పెంచలరెడ్డి దురాక్రమణ

5వ పేజీ కొరవ

పరువు ప్రతిష్ట వంటివన్నీ విడిచి పెట్టి ఎక్కడ ఎంత దొరికితే అంత దోచుకొనే తత్వాన్ని అలవరచుకొన్నాడు. కోట్లకు పడగలెత్తాడు. ధన దాహం పరమ భయానకమైనది. ధనం పోగు పడేకొద్దీ ఆ దాహం మరింత పెరిగి పోతుందే తప్ప తీరదు. నెల్లూరు నగరంలో ఆయన మాట శిలాశాసనం. పోలీసు, రెవెన్యూ, మునిసిపల్ అధికారులందరూ ఆయన కాళ్ల క్రింద చెప్పుల వలె సేవ చేసుకొని, తరిస్తున్నారు. అసలే కోతి, ఆపై కల్లు త్రాగింది, నిప్పు తొక్కింది అన్నట్లుంది పరిస్థితి.

దానితో పోలీసు బలగాలను వెంటబెట్టుకొని మరీ చంద్రమౌళినగర్ మీద వాలిపోయారు వాళ్లు. కూలికి వచ్చే రౌడీ మూకను పోగేసి, ఒక్కసారిగా ఆ స్థలం మీద పడ్డారు. గంటల వ్యవధిలో చెరువు గుంటలు పూడ్చి, ఆక్రమించడానికి ప్రయత్నించారు. అయితే స్థానికులు దాన్ని ప్రతిఘటించారు. పోలీసులు లాఠీలతో చావబాదినా లెక్క చేయకుండా అడ్డం పడుకొన్నారు. పరిస్థితి మరీ అదుపు తప్పి పోయే ప్రమాదం కనపడడంతో ఆక్రమణదారులు వెనుదిరగక తప్పలేదు. అయితే ఇది తాత్కాలికమే. రేపో ఎల్లుండో మరింత పెద్ద బలగంతో ఆ స్థలాన్ని భూబకాసురులు స్వాహా చేయడం ఖాయం. ఎమ్మెల్యే, ఆయన అనుచరుల రాజకీయ ప్రాబల్యం నెల్లూరులో అంతగా బలిసిపోయి వుంది ఇప్పుడు.

వీధి పోరాటం స్థాయిలో స్థానికులు ప్రభుత్వ స్థలాల ఆక్రమణను నిరోధిస్తుంటే, ఒక్క రెవెన్యూ అధికారి కూడా ఆ ఛాయలకు రాకపోవడం గమనించవలసిన అంశం. జాయింట్ కలెక్టర్ సొరభ్ గౌర్ ఇటీవల జిల్లా మొత్తంలో అక్రమ లేఅవుట్‌ల మీద దాడులు చేస్తున్నారు. ప్రైవేటు పొలాలలో స్థలాల వ్యాపారం చేసే వారిని వుడకాడిస్తున్నాడు. కానీ ఏకంగా ప్రభుత్వ స్థలాలే గుటకాయస్వాహా అవుతుంటే మాత్రం ఆయన నోరు మెదపడం లేదు. వ్యాపారులంటే నోరు చచ్చినవారు. అధికార జులుం చూపిస్తే పాదాక్రాంతమౌతారు. కోరిన కోరికలు తీరుస్తారు. అదే అధికారంలో వుండేవారి అక్రమాలకు అడ్డంపోతే, వినలేని తిట్లు తిడతారు. బదలీ శిక్ష విధిస్తారు. అందువల్ల ఆయన అలివి మాలినచోట అధికులమనరాదన్న సూక్తిని ఆచరణలో పెడుతున్నారు.

ఈ స్థలం పక్కనే, వేదాయపాళెం సెంటర్లో దాదాపు వంద కోట్ల రూపాయల విలువ చేసే బాలయోగీశ్వరస్వామి దేవస్థానం భూమిని ఇదే కాంగ్రెస్ రౌడీ మూక పబ్లిక్‌గా ప్లాట్లు చేసి అమ్ముతున్నది. మునిసిపల్ అధికారులు దగ్గరుండి విద్యుత్ స్తంబాలు నాటుతున్నారు. రోడ్లు వేయిస్తున్నారు. దానిపై దినపత్రికలు గోల గోలగా వార్తలు వ్రాస్తున్నాయి. కానీ కలెక్టర్ గారికి కానీ, జాయింట్ కలెక్టర్ గారికి కానీ అవి కనపడడం లేదు; వినపడడం లేదు. వాటి జోలికి వెళ్తే ఎమ్మెల్యే ఆగ్రహం చవిచూడవలసి వస్తుందన్న భీతితో కళ్లు, చెవులు మూసుకొని నపుంసకుల వలె బ్రతుకుతున్నారు వారిద్దరూ. నగరంలో దాదాపు వెయ్యి కోట్ల రూపాయల విలువ చేసే మునిసిపల్ స్థలాలు, పార్కులు, రిజర్వుడ్ ప్రాంతాలు ఇట్లనే ఆక్రమణలకు గురౌతున్నాయి. కానీ ఒక్క అధికారి కూడా వాటి జోలికి వెళ్లడం లేదు. లంచాల అమేధ్యాన్ని పరమాన్నం వలె ఆరగించే నీచ బుద్ధి, అధికారంలో వుండేవారి కాళ్లు కడిగి నెత్తిన నీళ్లు చల్లుకొనే హీన మనస్తత్వం ఐఏఎస్ అధికారులలో ప్రబలినప్పుడు ప్రజలకు దిక్కెవరు? ప్రజల ఆస్తులకు రక్షణ ఎక్కడ?

ఏదిఏమైనా నెల్లూరు నగరం రాజకీయ అరాచకత్వానికి, అధికారుల అధోగతికి నిలయంగా మారిపోతున్నది. ఈ శాపం నుంచి నిష్కృతి ఎప్పుడో తెలియడమే లేదు.

బిట్రగుంటపై శీతకన్ను!

రైల్వే బిట్రగుంటపై ఉన్నతాధికారులకు ఆగ్రహమెందుకో అర్థం కావడం లేదు. అక్కడి ఒక్కొక్క యూనిట్‌ను ధ్వంసం చేసిపారేస్తున్నా దీని ఆపాల్సిన పార్లమెంట్ సభ్యులు మౌనం దాల్చడం బాధాకరం.

కె.సుజాత కావలి

గృహ నిర్మాణ శాఖలో వసూల్ రాణీ ఆ... డిఇ!

నెల్లూరు గృహ నిర్మాణ శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేసే మహిళా అధికారిణి ముందు పురుష అధికారులు దిగదుడుపేనని చెప్పొచ్చు. ఒక పథకం ప్రకారం ఆమె వసూలు చేసే మామూళ్లకు ఆ శాఖలోని ఎఇలు హడలి పోతున్నారు.

ఆమె గృహనిర్మాణశాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్. ఈమె సర్వేపల్లి నియోజకవర్గంలోని తోటపల్లి గూడూరు, ముత్తుకూరు మండలాలు, కోవూరు నియోజకవర్గంలోని ఇందుకూరుపేట మండలంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ గృహాలను తనిఖీలు, పర్యవేక్షణ చేయాల్సి వుంటుంది. పని విధానంలో మాత్రం చొరవ కనబరచకుండా కేవలం అక్రమార్జనే ధ్యేయంగా పెట్టుకొని విధులు నిర్వహిస్తుందన్న విమర్శ వుంది. ఈ శాఖలో పనిచేస్తున్న పురుషుల కంటే తానేమి తక్కువ కాదన్న విధంగా క్రిందిస్థాయి సిబ్బంది నుంచి మామూళ్లు భారీగానే వసూలు చేస్తుంటారు. గృహనిర్మాణశాఖలో ఈ డిఇ పేరు వింటేనే ఎఇల దగ్గర నుంచి క్రిందిస్థాయి సిబ్బంది వరకు హడలెత్తి పోతున్నారు.


డిఇ మహిళ కావడంతో అధికారులు కూడా చర్యలు తీసుకునేందుకు వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తుంది. పైమూడు మండలాల ఎఇలు డిఇకి మామూళ్లు సమర్పించుకోవాలంటే ఇళ్ల నిర్మాణంలో అక్రమాలకు పాల్పడాల్సి వుంటుంది. గ్రామీణ ప్రాంతాల్లోని ఇందిరమ్మ గృహ నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు లేకపోయినా డిఇ పట్టించుకోరు. మండలాల పర్యటనకు వచ్చిన ప్రతిసారి సొంత వాహనానికి డీజిల్ ఫుల్‌ట్యాంక్ చేయించి ఎంతో కొంత నగదు సమర్పించుకోవాల్సి వుంటుందని ఎఇలు వాపోతున్నారు. ఈమె సొంత వాహనాన్ని అద్దె వాహనంగా చూపించి ప్రతినెల గృహనిర్మాణశాఖ నుంచి అద్దె తీసుకొంటుంది.

గృహ నిర్మాణ శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ తనిఖీలకు వస్తున్నదంటే మండలస్థాయిలో విధులు నిర్వహించే సిబ్బంది హడలెత్తుతున్నారు. మండలాలకు వెళుతున్న డిఇ గృహ నిర్మాణాలకు సంబంధించి తనిఖీలు చేసి లోపాల గురించి ప్రశ్నిస్తే ఫర్వాలేదు. ఇక్కడ ఆమె ఎవరిపైన ఏ ఆర్థికభారం మోపుతుందోనన్నదే సిబ్బంది భయం. పైమూడు మండలాల్లో ఇందిరమ్మ గృహాల పర్యవేక్షణ, తనిఖీలు సక్రమంగా చేయడం లేదన్న ఆరోపణలున్నాయి. ఇందిరమ్మ గృహాల పర్యవేక్షణ కోసం ప్రభుత్వం మహిళా డిఇని నియమించింది. ఈ డిఇ ఒకే రోజు మూడు మండలాల్లో పర్యటన కోసం వెళ్తుంటారు. మండలాల్లో పర్యటించేందుకు సొంత వాహనంలో బయలు దేరుతారు. నెల్లూరు నుంచి 15 కిలోమీటర్ల దూరంలోనే పై మూడు మండలాలున్నాయి. ఏ మండలానికి ముందుగా వెళితే అక్కడ సిబ్బంది డిఇ వాహనానికి ఫుల్‌ట్యాంక్ డీజిల్ పట్టించాల్సి వుంటుంది. వాహనానికి డీజిల్ నింపే బాధ్యత సంబంధిత ఎఇలు చూసుకోవాలి. ఒక మండలంలో ఫుల్‌ట్యాంక్ చేస్తే మిగిలిన రెండు మండలాల్లోని ఎఇల నుంచి ఇంధనానికి సంబంధించి నగదు వసూలు చేస్తుంటారన్న ప్రచారం వుంది. భోజన సదుపాయాలు కూడా కల్పించాల్సి రావడంతో ఎఇలు ఖంగుతింటున్నారు. నెల్లూరు నుంచి డిఇ వస్తున్నారంటే ఎఇలు అన్ని ఏర్పాట్లు చేయలేక నానా ఇబ్బందులు పడకతప్పదం లేదు. డిఇ చెప్పినట్లు వినకుంటే ఏదో ఒక కారణంతో ఏఇలను వేధిస్తుంటారని గృహనిర్మాణ సంస్థ ఉద్యోగులే వ్యాఖ్యానిస్తున్నారు. డిఇ సొంత వాహనంలో పర్యటిస్తూనే గృహ నిర్మాణ సంస్థ నుంచి నెలసరి అద్దె పొందుతున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా ఆమె ఎఇలు, ఇతర సిబ్బందిపై ఆర్థిక భారం మోపకుండా విధులు నిర్వహించాలని సిబ్బంది కోరుకొంటున్నారు.

● ధర్మల్ విద్యుత్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా

పిడికిలి బిగించిన ఎర్రదండు!

జిల్లాలోని తీరప్రాంత గ్రామాలు కాలుష్య కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతున్నాయని వామపక్ష నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో ఏర్పాటవుతున్న విద్యుత్ ధర్మల్ కేంద్రాల కారణంగా పచ్చని పల్లెసీమలు స్మశానంగా మారనున్నాయన్నారు. 6వ తేది నెల్లూరు నగరంలోని టౌన్ హాలులో ధర్మల్ కేంద్రాలను వ్యతిరేకిస్తూ వామపక్షపార్టీల ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సదస్సుకు జిల్లా నలుమూలల నుంచి అధికసంఖ్యలో ప్రజలు హాజరైనారు. గత రెండు నెలల నుంచి పలు మండలాలు, గ్రామాల్లో కూడా సదస్సులు నిర్వహించారు.



నెల్లూరు టౌనుహాలులో జరిగిన సభలో మాట్లాడుతున్న వామపక్ష నేతలు నారాయణ, రాఘవులు. హాజరైన జనం.

విద్యుత్ ధర్మల్ కేంద్రాల ఏర్పాటు కారణంగా కలిగే నష్టాలు కాలుష్యం గురించి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. రాష్ట్ర ప్రజలకు ఎంతమేరకు విద్యుత్ అవసరమవుతుంది. ప్రస్తుతం ఎంత ఉత్పత్తి అవుతుందన్న విషయాన్ని పరిగణలోనికి తీసుకోకుండా విచ్చలవిడిగా పవర్‌ప్లాంట్లుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. పవర్‌ప్లాంట్లకు భూములు సేకరించిన ప్రభుత్వం సమీప గ్రామాలను సైతం ఖాళీ చేయించాలన్న ఆలోచనతో వుంది. ఈ నేపథ్యంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు ఊపందుకున్నాయి. ప్రజల జీవన విధానానికి విఘాతం కలిగించే పరిశ్రమలు వద్దంటూ ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

టౌన్‌హాలులో నిర్వహించిన ధర్మల్ కేంద్రాల వ్యతిరేక సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి బి.వి.రాఘవులు, సి.పి.ఐ రాష్ట్ర కార్యదర్శి నారాయణ వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్నాయని బి.వి.రాఘవులు ధ్వజమెత్తారు. వేలాది ఎకరాల వ్యవసాయ భూముల్ని పరిశ్రమల పేరుతో బడా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అప్పగించి, ప్రజల జీవనానికి తీవ్ర ఇబ్బంది కలిగిస్తుందని విమర్శించారు. పరిశ్రమలకు భూములు కేటాయించే బాధ్యతను స్వీకరించిన ఎపిఐఐసి అధికారులు రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తూ రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు.

వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో అవసరానికి మించి విద్యుత్ ప్లాంట్లకు అనుమతి ఇవ్వరాదని సిఎంను కలిస్తే స్పందించడం పోయి భవిష్యత్తును దృష్టిలో వుంచుకొని అనుమతి ఇచ్చామని చెప్పడం బాధ కలిగించిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి నారాయణ అన్నారు. ప్రజలు రోడ్ల పైకి వచ్చి ఆందోళ, నిరసన కార్యక్రమాలు చేస్తుంటే పోలీసుల్ని మోహరించి లాఠీచార్జి చేయించడంతోపాటు కాల్పులు సైతం జరిపించడం దారుణమన్నారు. దీనికి ఇందుకు శ్రీకాకుళం జిల్లా కాకరాపల్లిని ఉదహరించారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని, అభివృద్ధిని కోరుకోవాలే తప్ప వారి వినాశనాన్ని కాదన్న విషయం సిఎం గుర్తించాలన్నారు.

నెల్లూరు జిల్లాలో దాదాపు 38 పవర్‌ప్లాంట్లకు అనుమతులున్నాయన్నారు. ఈ ప్లాంట్లన్నీ కూడా బొగ్గుతో విద్యుత్ ఉత్పత్తి చేస్తాయన్నారు. అన్ని ప్లాంట్లు నిర్మాణాలు పూర్తి చేసుకొని ఉత్పత్తి ప్రారంభిస్తే 20 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలు కాలుష్య కోరల్లో చిక్కుకొనే ప్రమాదం వుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సదస్సులో కిషోర్‌బాబు, దామా చెంచయ్య, దినకర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. సదస్సుకు సిపిఎం జిల్లా కార్యదర్శి జక్కా వెంకయ్య అధ్యక్షత వహించారు.

Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/09-11

ఉత్తరక్రియలు



శ్రీ నారాయణస్వామి - శ్రీమతి జయలక్ష్మి

అధినేత : M/S శ్రీ విజయలక్ష్మి ట్రేడర్స్ & M/S గోల్డన్ ఇంజనీరింగ్

డీలర్స్ : టెక్స్‌మో మోటర్స్ - కిర్లోస్కర్ జనరేటర్స్

మూర్తీభవించిన మానవత్వం, పరిమళించిన ప్రేమామృత మూర్తిత్వంతో

మా జీవితాలలో వెలుగులు నింపిన తేజోమూర్తులు, మా మనోమందిరాలలో దివ్యదీప్తులు

శ్రీ నారాయణస్వామి, శ్రీమతి జయలక్ష్మి గారు

తేది 28-05-2011 శనివారం మమ్ములను వీడి ధైవసాన్నిధ్యం చేరారు.

వారి పవిత్రాత్మకు శాంతిని ప్రసాదించమని భగవంతుని ప్రార్థిస్తూ... శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

కుమారులు - కోడళ్లు

ఎన్. దామోదర్ - డి.హిమబిందు

ఎన్. వినోద్‌కుమార్ - వి.విష్ణుప్రియ

కుమార్తెలు - అల్లుళ్లు

ఎం.సి వాణి - ఎం.సి. బాలాజి శేఖర్

టి.సుజాత - టి.శ్రీనివాసులు

మనుమలు - మనుమరాళ్లు

సవ్యగ్‌కిషోర్, యశ్వంత్, సాయి చందన్, హేమంత్, కౌషల్, గిరిష్‌గౌతమ్, దేవిప్రియ, వెంకట విశ్వర్య

పెద్దకర్మ : 15-06-2011 బుధవారం లెక్చరర్స్ కాలనీ మొదటి వీధి, మాగుంట లేఅవుట్, నెల్లూరు లోని మా స్వగృహం నందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.